@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
శుక్రవారం 20 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

మీ వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తే అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వచ్చే 20 ఏళ్ల పెట్టుబడుల్లో ‘ఇండియా ఫస్ట్’!

- పరిశ్రమలకు ప్రధాని మోదీ కీలక పిలుపు
- వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెంచండి..
- స్వదేశీ ఉత్పత్తుల నాణ్యతతో ప్రపంచ మార్కెట్లను గెలవండి
- ఉద్యోగుల వేతనాలు పెంచుతున్నారా?
- పన్ను రాయితీల ప్రయోజనాలు కార్మికులకూ అందాలి



భారత ప్రజాస్వామ్యం పవిత్రమైనది

- ఎన్నికలను బహిష్కరిస్తే అంతం: రాహుల్ గాంధీ
- ఓటములు ఎదురైనా పోరాటం ఆపేది లేదు..
- ఎన్నికల వ్యవస్థలో లోపాలపై ప్రజలకు వివరిస్తాం
- మోదీ సర్కారుపై జైరాం రమేశ్ విమర్శలు..

మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి

బ్లూప్రింట్



- విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లపై సీఎం చంద్రబాబు సమీక్ష
- సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ అభివృద్ధి
- గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి
- క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అమరావతి రాజధాని
- సూర్యలంక, గండికోట ప్రాంతాలకు టూరిజం మాస్టర్ ప్లాన్

అమరావతి

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల (ఎకనామిక్ రీజియన్స్) ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి అసలైన బ్లూప్రింట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఈ మూడు ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి బ్లూప్రింట్లపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేవలం పరిశ్రమల రాక, పెట్టుబడుల ఆకర్షణ మాత్రమే అభివృద్ధి కాదని, వాటి ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు. తలసరి - మిగతా3లో



మిగులు జలాలపై హక్కులు రావు

- కొత్త ప్రాజెక్టులకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- ఏపీ, తెలంగాణకు కీలక సూచనలు..
- అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టీకరణ
- ట్రిబ్యునల్-2 అవార్డు వచ్చే వరకు చట్టబద్ధ విధానాలు పాటించాలని ఆదేశం
- మిగులు జలాల అంచనాతో నీటిపై హక్కులు రావని తేల్చిచెప్పిన బోర్డు



భారత్-జపాన్ బంధం మరింత బలోపేతం!

- రక్షణ రంగంలో కీలక ఒప్పందాలకు వేగం..
- ‘యూనికార్న్’ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి
- స్టెల్త్ మాస్ట్ సాంకేతికత అభివృద్ధికి సహకారం..
- సముద్ర భద్రత, నౌకాదళ ఆధునికీకరణపై కీలక చర్చలు

డిసెంబర్ 2న మూడో దశ పంచాయతీ

ఎన్నికలు



- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం..
- ఈ నెల 21 నుంచి నామినేషన్ల స్వీకరణ
- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న నామినేషన్ల పరిశీలన.. 27న ఉపసంహరణకు గడువు
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్
- అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ఎస్ఈసీ.. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపింది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ నెల 21, 22, 23 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు 27వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ఖరారు - మిగతా3లో

ఎంపీపీ ఎన్నికల వేళ ఉత్కంఠ..

ఏలు మండలాల్లో వాయిదా



- కోరం లేక కొన్నిచోట్ల నిలిచిన ప్రక్రియ..
- మరికొన్ని చోట్ల వర్గపోరు, వాగ్వాదాలు
- సమాన బలాబలాలతో మరికొన్ని మండలాల్లో సందిగ్ధం..
- శుక్రవారం తిరిగి ఎన్నికలు



గ్రూప్ రిజర్వేషన్లపై

బెర్తుల పరిమితి తొలగింపు

- రైల్వే కొత్త నిబంధనలు
- బల్క్ టికెట్ల బుకింగ్ నిబంధనలను సవరించిన సౌత్ వెస్ట్రన్ రైల్వే
- గ్రూప్ బుకింగ్స్‌కు గరిష్ఠ బెర్తుల పరిమితిని పూర్తిగా ఎత్తివేత
- స్టేషన్ మేనేజర్లు, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్లకే అనుమతి ఇచ్చే అధికారం

సైనిక చర్యపై రాజకీయ రగడ



- ఆపరేషన్ సిందూర్‌పై కుంభకోణం ఆరోపణలు.. మంత్రి వ్యాఖ్యలతో దుమారం
- రాఫెల్ ధరలపై వివాదాస్పద వ్యాఖ్యలు
- మంత్రి తీరుపై బీజేపీ తీవ్ర అభ్యంతరం
- సభలో నిరసన.. బయట విమర్శల దాడి



రాప్తాడు బాలిక ఫైటర్.. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యం!

- పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడిపే వరకు అండగా ఉంటా
- వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్యులతో మాట్లాడిన లోకేశ్
- డిశ్చార్జ్ తర్వాతా ప్రత్యేక వైద్య సంరక్షణ



బర్డ్‌ఫ్లూ కట్టడికి స్వదేశీ వ్యాక్సిన్

- భారత్ శాస్త్రవేత్తల కీలక ముందడుగు!
- హెచ్5ఎన్1 వైరస్‌ను ఎదుర్కొనేందుకు తొలి దేశీయ టీకా అభివృద్ధి
- నవంబర్ 20న దేశానికి అంకితం చేయనున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

భారత్-జపాన్ బంధం మరింత బలోపేతం!

టోక్యో: భారత్, జపాన్ మధ్య రక్షణ, వ్యూహాత్మక సంబంధాలు మరో కీలక మలుపు తిరుగుతున్నాయి. మారుతున్న అంతర్జాతీయ పరిణామాలు, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న భద్రతా సవాళ్ల నేపథ్యంలో ఇరు దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు నిర్ణయించాయి. రక్షణ సాంకేతికత అభివృద్ధి, యుద్ధ నౌకల ఆధునికీకరణ, సముద్ర భద్రత, సైనిక సమాచార మార్పిడి వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని అంగీకరించాయి. ముఖ్యంగా యూనికార్న్ ప్రాజెక్టుకు సంబంధించిన రక్షణ ఒప్పందాలను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాయి. టోక్యోలో జరిగిన నాలుగో భారత్--జపాన్ 2+2 విదేశాంగ, రక్షణ మంత్రుల సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటెగి, రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిణామాలపై విస్తృతంగా చర్చించారు.

యూనికార్న్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

భారత్--జపాన్ రక్షణ భాగస్వామ్యంలో యూనికార్న్ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. నౌకాదళ యుద్ధ నౌకల కోసం ప్రత్యేక స్టెల్త్ మాస్ట్ సాంకేతికతను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. యుద్ధ నౌకల్లోని రాడార్, కమ్యూనికేషన్, ఇతర ఎలక్ట్రానిక్ వ్యవస్థలను సమర్థంగా అనుసంధానించే ఈ సాంకేతికత వల్ల శత్రు రాడార్లకు నౌకలు సులభంగా చిక్కకుండా ఉండేందుకు వీలవుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ భారత్‌లోనే అధునాతన రక్షణ పరికరాల తయారీని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి.

'డిజైన్ విత్ జపాన్ -- మేక్ ఇన్ ఇండియా' విధానంలో రక్షణ ఉత్పత్తుల తయారీని విస్తరించేందుకు ఇరు దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. నీటి అడుగున పనిచేసే పరికరాలు, క్షిపణి సాంకేతికత, అధునాతన రక్షణ వ్యవస్థల తయారీలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. దీనివల్ల భారత రక్షణ పరిశ్రమలకు జపాన్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పాటు స్వదేశీ తయారీ సామర్థ్యం పెరగనుంది.

సముద్ర భద్రతకు ఉమ్మడి వ్యూహం

హిందూ మహాసముద్రం, ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లో సముద్ర భద్రతను మరింత పటిష్ఠం చేయడంపై భారత్, జపాన్ ప్రత్యేక దృష్టి సారించాయి. ఇటీవల కుదిరిన సముద్ర భద్రత సహకార ఒప్పందాన్ని త్వరగా అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించాయి. సముద్ర, గగనతల నిఘా, ప్రమాదాల్లో



చిక్కుకున్న వారిని రక్షించడం, కీలక సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం వంటి అంశాల్లో సమన్వయంతో పనిచేయనున్నాయి.

ఇరు దేశాల నౌకాదళాలు పరస్పరం ఒకరి దేశంలోని నౌకా మరమ్మతు కేంద్రాలను మరొకరు వినియోగించుకునేలా ప్రత్యేక ఒప్పందాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నాయి. సముద్రంలో అమర్చిన మందుపాతరలను గుర్తించడం, వాటిని నిర్వీర్యం చేసే సామర్థ్యాలను పెంపొందించుకోవడంపైనా సహకారాన్ని విస్తరించనున్నాయి. ఇప్పటికే ఇరు దేశాల మధ్య సైనిక సహకారం గణనీయంగా పెరిగిందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. భారత్‌లో నిర్వహించిన వీర్ గార్డియన్--2026 వైమానిక విన్యాసాల్లో తొలిసారిగా జపాన్ వైమానిక దళ యుద్ధ విమానాలు పాల్గొనడం కీలక పరిణామమని పేర్కొన్నారు. అక్టోబర్ 13న టోక్యోలో జరిగిన మూడో భారత్--జపాన్ రక్షణ పరిశ్రమల వేదిక సమావేశం కూడా రక్షణ రంగ భాగస్వామ్యానికి దోహదపడిందని తెలిపారు.

బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణమే లక్ష్యం

అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులపైనా ఇరు దేశాల మంత్రులు చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితులు, వాణిజ్య సమస్యలు, సరఫరా వ్యవస్థల్లో ఎదురవుతున్న అవరోధాలు ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, వాణిజ్య భద్రతపై ప్రభావం చూపుతున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో భారత్, జపాన్ వంటి విశ్వసనీయ భాగస్వామ్య దేశాల మధ్య సహకారం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఇరు దేశాలు కలిసి పనిచేయడం ద్వారా ఆసియాలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ కీలక పాత్ర పోషించగలవని అన్నారు. బహుళ ధ్రువ ఆసియా, బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణానికి భారత్--జపాన్ భాగస్వామ్యం దోహదపడుతుందని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కూడా ఇరు దేశాలు గుర్తించాయని తెలిపారు. ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం, ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

క్వాడ్ భాగస్వామ్యంతో ఇండో-పసిఫిక్‌కు భరోసా

ఇండో-పసిఫిక్ ప్రాంతం స్వేచ్ఛగా, బహిరంగంగా, సురక్షితంగా ఉండాలన్న లక్ష్యంతో క్వాడ్ భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేస్తున్నట్లు జైశంకర్ తెలిపారు. సముద్ర మార్గాలు, అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు, సరఫరా వ్యవస్థలను కొన్ని దేశాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించుకునే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో సముద్ర రవాణా నిరంతరాయంగా కొనసాగడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్యంలో సముద్ర మార్గాల ప్రాధాన్యం దృష్ట్యా వాటి భద్రతకు అన్ని దేశాలు బాధ్యత తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

యుద్ధ స్వరూపం కూడా వేగంగా మారుతోందని, స్మార్ట్ ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ఆధారిత రక్షణ వ్యవస్థల ప్రాధాన్యం పెరుగుతోందని జైశంకర్ వివరించారు. ఈ రంగాల్లో భారత్, జపాన్ కలిసి పనిచేస్తే రక్షణ సామర్థ్యాలు పెరగడమే కాకుండా పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు కూడా కొత్త అవకాశాలు లభిస్తాయని అన్నారు.

75 ఏళ్ల దౌత్య బంధానికి ముందస్తు సన్నాహాలు

భారత్--జపాన్ దౌత్య సంబంధాలకు 2027లో 75 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ చారిత్రక మైలురాయికి ముందుగానే రక్షణ, భద్రత, సాంకేతిక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. 2025 ఆగస్టులో కుదిరిన భద్రతా సహకార ఉమ్మడి ప్రకటన అమలులో భాగంగా తాజా చర్చలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2026లోనే రాజ్‌నాథ్ సింగ్, జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి మధ్య ఇది మూడో సమావేశం కావడం ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రక్షణ సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

జపాన్ నౌకాదళ స్థావరాన్ని సందర్శించిన రాజ్‌నాథ్

సమావేశం అనంతరం భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జపాన్‌లోని యోకోసుకా నౌకాదళ స్థావరాన్ని సందర్శించారు. జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమితో కలిసి మొగామి తరగతికి చెందిన బహుళ ప్రయోజన యుద్ధ నౌక జేఎస్ నాటోరిని పరిశీలించారు. జపాన్ నౌకాదళ ఆధునికీకరణ, అధునాతన యుద్ధ నౌకల సామర్థ్యాలను ఆయనకు వివరించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ వివాదాలను అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. ప్రపంచవ్యవస్థలో ప్రతి దేశం తన బాధ్యతను పెంచుకోవాల్సిన ప్రస్తుత తరుణంలో భారత్--జపాన్ భాగస్వామ్యం మరింత కీలకంగా మారుతోందని జైశంకర్ పేర్కొన్నారు.

సైనిక చర్యపై రాజకీయ రగడ

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో రెవెన్యూ మంత్రి జగత్ సింగ్ నేగి చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. రాఫెల్ ఫైటర్ జెట్ల కొనుగోలు ధరపై అవినీతి ఆరోపణలు చేస్తూ..'ఆపరేషన్ సిందూర్' సమయంలో సైన్యం, రాఫెల్ పనితీరుపై ఆయన చేసిన వ్యాఖ్యలపై గురువారం సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అసెంబ్లీ చర్చ సందర్భంగా మంత్రి జగత్ సింగ్ నేగి మాట్లాడుతూ.. రూ. 700 కోట్ల విలువైన రాఫెల్ యుద్ధ విమానాన్ని రూ. 2,300 కోట్లకు కొనుగోలు చేశారని, ఆ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని ఆరోపించారు. అదేమైనా బంగారు, వెండి జెట్టా? అని ప్రశ్నిస్తూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌పై అనుకున్న స్థాయిలో ఒత్తిడి తీసుకురాలేకపోయామని, పైగా మనకే కఠిన పరిస్థితులు ఎదురయ్యాయనే అర్థంలో వ్యాఖ్యానించారు.

అసెంబ్లీలో రగడ.. బీజేపీ వాకౌట్

మంత్రి వ్యాఖ్యలపై గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష బీజేపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్, భారత సైన్యంపై చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని, మంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. దీనిపై స్పందించిన మంత్రి జగత్ సింగ్ నేగి క్షమాపణ చెప్పేందుకు నిరాకరించారు. నవంబర్ 18 నాటి అసెంబ్లీ చర్చల రికార్డు కాపీని సభ ముందు ఉంచుతూ.. తాను తప్పుగా ఏమీ మాట్లాడలేదని, అప్పట్లోనే అభ్యంతరం చెప్పకుండా ఇప్పుడు క్షమాపణ ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించారు. మంత్రి సమాధానంతో అసంతృప్తి వ్యక్తం చేసిన బీజేపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. సభ బయట, సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. సైన్యం శౌర్యాన్ని, ఆపరేషన్ సిందూర్‌ను కించపరిచేలా మాట్లాడటం శోచనీయమని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలను ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సమర్థిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు హర్ష్ మహాజన్ కూడా మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ, జాతీయ భద్రత, రక్షణ అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

పహల్గామ్ దాడి

గతేడాది (2025) ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. మతపరమైన ఉద్రిక్తతలు రేకెత్తించడం, కాశ్మీర్ పర్యాటక రంగం ద్వారా నెలకొన్న ప్రశాంతతను దెబ్బతీయడం లక్ష్యంగా ఈ దాడి జరిగిందని అధికారులు పేర్కొన్నారు. దీనికి లష్కర్-ఎ-తొయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ బాధ్యత వహించింది. ఈ ఘటనకు ప్రతిస్పందనగా భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడులు నిర్వహించడంతో పాటు, సరిహద్దుల్లో నిఘా, భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. సింధు జల ఒప్పందం నిలిపివేత వంటి కఠిన దౌత్య నిర్ణయాలకు దారితీసిన ఈ పరిణామాలు, కాశ్మీర్ పర్యాటకంపై తాత్కాలిక ప్రభావం చూపినప్పటికీ, ఉగ్రవాదంపై దేశవ్యాప్తంగా ఐక్యతను, కఠిన వైఖరిని చాటిచెప్పాయి.

భారత ప్రజాస్వామ్యం పవిత్రమైనది..

న్యూఢిల్లీ: భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లు, ఓటములు ఉన్నప్పటికీ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయనే కారణంతో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరిస్తే దేశ ప్రజాస్వామ్యానికి ముగింపు పలికినట్లేనని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమస్యలున్నాయని ఆరోపిస్తూ ఎన్నికలకు దూరంగా ఉండటం తమ పార్టీ విధానం కాదని తేల్చిచెప్పారు. రెండు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా చికాగో విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియపై తమకు ఉన్న అభ్యంతరాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ప్రజాస్వామ్య వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనకుండా ఉంటే ప్రజలకు తమ గొంతు వినిపించే అవకాశం కోల్పోతామని అభిప్రాయపడ్డారు.

ఎన్నికల బహిష్కరణకు కాంగ్రెస్ వ్యతిరేకం

ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయన్న ఆరోపణలతో ఎన్నికలను బహిష్కరిస్తే భారత ప్రజాస్వామ్యం అంతమవుతుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు చేయాలంటే తమ వద్ద 100, 200, 300 శాతం కచ్చితమైన ఆధారాలు ఉండాలని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యకర్తలకు ఎన్నికల్లో పాల్గొనవద్దని పిలుపునిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్న క్షణమే ప్రజాస్వామ్య ప్రక్రియకు నష్టం జరుగుతుందని అన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం కాంగ్రెస్ లక్ష్యం కాదని స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఎన్నికల వ్యవస్థలో ఏం జరుగుతోందో ప్రజలకు వివరించడం, ఎదురయ్యే రాజకీయ ఓటములను భరిస్తూనే పోరాటం కొనసాగించడం తమ వ్యూహమని వెల్లడించారు. ప్రజలు వ్యవస్థలోని సమస్యలను పూర్తిగా గుర్తించే వరకు తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు.

గ్రూప్ రిజర్వేషన్లపై బెర్త్‌ల పరిమితి తొలగింపు..

సమూహాలుగా ప్రయాణించే ప్రయాణికుల కోసం సౌత్ వెస్టర్న్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. వివాహాలు, విద్యా విహారయాత్రలు, తీర్థయాత్రలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రయాణించే వారి సౌకర్యార్థం బల్క్ (గ్రూప్) టికెట్ బుకింగ్ నిబంధనలను సవరించింది. పాత నిబంధనల స్థానంలో కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తెచ్చినట్లు ఎస్‌డబ్ల్యూఆర్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ మంజునాథ్ కనమడి వెల్లడించారు. తాజా నిబంధనల ప్రకారం... గ్రూప్ టికెట్ల బుకింగ్‌పై ఉన్న గరిష్ఠ బెర్తుల పరిమితిని ఎస్‌డబ్ల్యూఆర్ పూర్తిగా ఎత్తివేసింది. అంతేకాకుండా, ఈ బుకింగ్‌లకు అనుమతి ఇచ్చే అధికారాన్ని డివిజనల్ కార్యాలయాల నుంచి స్థానిక స్టేషన్లకే అప్పగించారు. ప్రధాన రిజర్వేషన్ కేంద్రాల్లోని స్టేషన్ మేనేజర్లు, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్లు ఇకపై ఎలాంటి ముందస్తు బెర్త్ పరిమితి లేకుండా గ్రూప్ బుకింగ్‌లను ఆమోదించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. సాధారణ అడ్వాన్స్ రిజర్వేషన్ సమయం ప్రారంభమైన గంట తర్వాత, అంటే ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి ఈ దరఖాస్తులను స్వీకరిస్తారు. అన్ని తరగతుల్లో కన్ఫర్మ్, ఆర్ఏసీ లేదా వెయిటింగ్ లిస్ట్ టికెట్లకు ఈ వెసులుబాటు వర్తిస్తుంది. అయితే, దరఖాస్తుదారులు నేరుగా రైల్వే అధికారులకే దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా వచ్చే దరఖాస్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని రైల్వే స్పష్టం చేసింది. కేవలం విదేశీ పర్యాటకులు, ఎన్నారైలకు మాత్రమే పాత నిబంధనల ప్రకారం మినహాయింపు ఉంటుంది. దరఖాస్తు చేసుకునే సమయంలో ప్రయాణికులందరి పేర్లు, వయస్సు, లింగం, చిరునామాతో పాటు ప్రయాణ ఉద్దేశాన్ని స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. ఈ సదుపాయం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి, దరఖాస్తులపై సీల్, సంతకం చేయాలని రైల్వే ఆదేశించింది. అలాగే తిరుగు ప్రయాణానికి కూడా అదే కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, అయితే దానిని ప్రత్యేక లావాదేవీగా పరిగణిస్తారని అధికారులు తెలిపారు.

బర్డ్‌ఫ్లూ కట్టడికి స్వదేశీ వ్యాక్సిన్



భోపాల్: దేశంలో పౌల్ట్రీ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న బర్డ్‌ఫ్లూ నియంత్రణ దిశగా భారత శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. కోళ్లకు సోకే హెచ్5ఎన్1 బర్డ్‌ఫ్లూ వైరస్‌ను ఎదుర్కొనేందుకు తొలిసారిగా స్వదేశీ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ శాస్త్రవేత్తలు ఈ టీకాను రూపొందించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్ పౌల్ట్రీ రంగానికి కొత్త భరోసా కల్పించనుందని భావిస్తున్నారు.

పౌల్ట్రీ రంగానికి ఊరట

బర్డ్‌ఫ్లూ వ్యాధి కారణంగా కోళ్ల పెంపకం, గుడ్లు, చికెన్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలపై ప్రభావం పడుతోంది. వైరస్ వ్యాప్తి చెందిన ప్రాంతాల్లో కోళ్ల మరణాలు, ముందస్తు నిర్మూలన చర్యలతో పౌల్ట్రీ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో హెచ్5ఎన్1 వైరస్‌ను లక్ష్యంగా చేసుకుని స్వదేశీ టీకా అభివృద్ధి చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వచ్చే 20 ఏళ్ల పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'!

న్యూఢిల్లీ: భారత్‌ను ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా, స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దాలంటే పారిశ్రామిక రంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. రాబోయే 20 ఏళ్లలో పరిశ్రమలు తీసుకునే ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయంలోనూ 'ఇండియా ఫస్ట్' అనే ఆలోచనే ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పెట్టుబడులను గణనీయంగా పెంచాలని, దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. దేశాభివృద్ధికి అవసరమైన సంస్కరణలపై పరిశ్రమల ప్రతినిధులు ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా తనకు సూచనలు చేయవచ్చని స్పష్టం చేశారు. దిల్లీలో నిర్వహించిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశం, వార్షిక సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. 'భారత్ 2047' లక్ష్యంగా దేశ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, అంతర్జాతీయ మార్కెట్లలో భారత స్థానం, స్వదేశీ తయారీ వంటి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. పరిశ్రమలు, రైతులు, చిన్న వ్యాపారులు, సంపద సృష్టికర్తలు, పన్నులు చెల్లించే వారిని గౌరవించినప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

గాంధీజీ స్వదేశీ సందేశాన్ని గుర్తుచేస్తూ..

దేశీయ ఉత్పత్తులు, స్వయం సమృద్ధి గురించి మహాత్మాగాంధీ 1930లో ఇచ్చిన సందేశాన్ని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు వందేళ్లు గడిచినా స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని మళ్లీ చెప్పాల్సిన పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. భారత పరిశ్రమలు దేశీయంగా తయారయ్యే వస్తువుల నాణ్యతను పెంచి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో దేశ ఆర్థిక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలు పెట్టుబడులు పెట్టాలని కోరారు.

పరిశ్రమలకు మిత్రుడిగా ప్రభుత్వం

గత ప్రభుత్వాల సమయంలో పరిశ్రమలు ఎదుర్కొన్న అనుభవాలు అంత సానుకూలంగా ఉండేవి కావని మోదీ వ్యాఖ్యానించారు. ఆ ప్రభావం ఇప్పటికీ పరిశ్రమలకు, ప్రభుత్వానికి మధ్య సంబంధాల్లో కనిపిస్తోందని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమలను భాగస్వాములుగా, మిత్రులుగా చూస్తోందని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి ఇంకా ఎలాంటి విధానపరమైన మార్పులు అవసరమో పరిశ్రమల ప్రతినిధులు బహిరంగంగా తెలియజేయాలని కోరారు. భయం, సంకోచం లేకుండా నేరుగా తనకు లేఖలు రాయవచ్చని చెప్పారు. పరిశ్రమల నుంచి వచ్చే నిర్మాణాత్మక సూచనలను ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.

వ్యవసాయ అనుబంధ రంగాల్లో భారీ పెట్టుబడులు

దేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలకమని, ఈ రంగంలో పరిశ్రమలు మరింత పెట్టుబడులు పెట్టాలని ప్రధాని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ఏయే దేశాల్లో డిమాండ్ ఉందో



గుర్తించి, అందుకు అనుగుణంగా ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. విదేశీ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచి పంటలను సేకరించే పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెరిగితే రైతులకు మెరుగైన ఆదాయం లభించడంతో పాటు భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వస్తుందని అభిప్రాయపడ్డారు.

ఔషధ తయారీలో దిగుమతులపై ఆధారమెందుకు?

ఔషధ తయారీ రంగంలో భారత్ మరింత స్వయం సమృద్ధి సాధించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలకు మందులు సరఫరా చేసే స్థాయిలో భారత్ ఎదిగినప్పటికీ, ఔషధ తయారీకి అవసరమైన కీలక ముడి పదార్థాల విషయంలో విదేశాలపై ఆధారపడాల్సి వస్తోందని గుర్తుచేశారు. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్ బల్క్ డ్రగ్స్, ఔషధ తయారీలో ఉపయోగించే ఇతర మధ్యవర్తి పదార్థాలను భారీగా దిగుమతి చేసుకుంటున్నామని పేర్కొన్నారు. వీటిలో దేశీయంగా తయారు చేయగలిగే ఉత్పత్తులను గుర్తించి, ఆధునిక సాంకేతికతతో భారీ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పరిశ్రమలకు సూచించారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గితే ఔషధ రంగంలో భారత్ మరింత బలపడుతుందని చెప్పారు.

ఉద్యోగుల జీతాలు పెంచారా?

పన్నుల విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను ప్రస్తావిస్తూ పరిశ్రమలకు మోదీ కీలక ప్రశ్న సంధించారు. 2014లో 30 శాతంగా ఉన్న ప్రాథమిక కార్పొరేట్ పన్ను రేటును 22 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంలోనూ సంస్కరణలు చేపట్టామని, కొత్త పన్ను విధానంలో ఏడాదికి రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను భారం లేకుండా చేశామని వివరించారు. పన్ను రిటర్నుల దాఖలు, రిఫండ్ ప్రక్రియలను సులభతరం చేశామని పేర్కొన్నారు. గతంలో పన్ను వాపసు రావడానికి నెలల సమయం పట్టేదని, ఇప్పుడు అనేక సందర్భాల్లో వారంలోపే రిఫండ్ అందుతోందని చెప్పారు. అయితే ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను తగ్గించినప్పుడు పరిశ్రమలు తమ ఉద్యోగుల సంఖ్యను పెంచాయా? వారి వేతనాలను కూడా పెంచాయా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం కల్పిస్తున్న పన్ను రాయితీల ప్రయోజనాలు కేవలం సంస్థలకే పరిమితం కాకుండా ఉద్యోగులకు, కార్మికులకు కూడా చేరాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ

గత వందేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని మోదీ వివరించారు. లైసెన్స్ కోటా రాజ్, జాతీయీకరణ విధానాల నుంచి ఒక దశలో ప్రపంచంలోని బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన పరిస్థితులను ప్రస్తావించారు. గత 12--13 ఏళ్లలో ప్రజలు, రైతులు, యువత, కార్మికులు, పారిశ్రామిక రంగం చేసిన కృషితో దేశ ఆర్థిక పరిస్థితి గణనీయంగా మారిందని చెప్పారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోందని, దాదాపు 7 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయని తెలిపారు.

నాణ్యత విషయంలో రాజీ వద్దు

ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావిస్తూ గత 12--13 ఏళ్లలో సుమార

మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్

-మొదటిపేజీ తరువాయి

ఆదాయాన్ని పెంచేలా అధికార యంత్రాంగం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో యాంకర్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రాంతానికి 'విశాఖ బే-టెక్ సిటీ'గా నామకరణం చేశారు. గతంలో హైదరాబాద్‌లో సైబరాబాద్‌ను నిర్మించిన విధంగానే, విశాఖకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో బే-టెక్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగర మేయర్‌కు వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఈ రీజియన్‌లో 167 ప్రాజెక్టులకు గానూ ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. విజయనగరం, అనకాపల్లి వైపు వేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ముందస్తుగానే ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని చెప్పారు. భూ లభ్యత తక్కువగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సమన్వయంతో ప్రత్యేక ల్యాండ్ పాలసీ తీసుకురావాలని ఆదేశించారు. ఏడాదిలోగా విశాఖలో కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేసి, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించాలని నిర్దేశించారు.

సెమీకండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్ల రంగాలకు అవసరమైన ఆర్ అండ్ డీ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి క్లస్టర్లను బలోపేతం చేయడంతో పాటు ఈ రీజియన్‌లోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. తిరుపతి ప్రాంతానికి ఇప్పటికే రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, అందులో రూ.5.70 లక్షల కోట్లు కేవలం గ్రీన్ ఎనర్జీ రంగంలోనే నమోదయ్యాయని వివరించారు. రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగానికి సంబంధించి ప్రత్యేక మాగ్నెటిక్ క్లస్టర్, మూడేళ్ల లక్ష్యంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

క్వాంటం హబ్‌గా అమరావతి

అమరావతి ప్రాంతంలో ఆక్వా, కోకో, పామాయిల్ రంగాలు ప్రధాన ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని, ప్రస్తుతం రూ.4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు పురోగతిలో



ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతిని భవిష్యత్ 'క్వాంటం కారిడార్'గా, క్వాంటం వ్యాలీ, క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల అనుసంధానంతో పాటు అమరావతి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాంత పురోగతికి కీలకంగా మారుతాయని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈల అనుసంధానం - నాలెడ్జ్ పార్టనర్లు

భారీ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, సేవలు అందించేలా ఎంఎస్ఎంఈలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి పారిశ్రామిక క్లస్టర్ వద్ద విద్య, వైద్యం, నివాస సదుపాయాలతో కూడిన పూర్తి ఎకోసిస్టమ్‌ను నిర్మించాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాల నుంచి విలువైన పదార్థాలను రీసైక్లింగ్ చేసే నూతన సాంకేతికతలపై దృష్టి పెట్టాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ఐఐటీ తిరుపతి, బిట్స్ పిలానీ వంటి ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించుకోవాలని, పాన్-ఐఐటీ నిపుణుల సేవలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

పర్యాటకానికి మాస్టర్ ప్లాన్

రాష్ట్రంలో పర్యాటకాన్ని లాభదాయక ఆర్థిక వనరుగా మార్చాలని సీఎం పిలుపునిచ్చారు. అరకు, లంబసింగి ప్రాంతాలకు రహదారులు, మౌలిక వసతులు మెరుగుపరచాలని, సీఐఐ సదస్సు ప్రతినిధులను అక్కడికి తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సూర్యలంక, గండికోట పర్యాటక ప్రాంతాలకు సమగ్ర మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని, సూర్యలంకను వెంటనే నోటిఫై చేయాలని ఆదేశించారు. ఓడరేవు, చినగంజాం, నిజాంపట్నం, దిండి తీర ప్రాంతాలను పర్యావరణహిత బీచ్ రిసార్టులుగా తీర్చిదిద్దాలన్నారు. అమరావతి-నాగార్జునకొండలను అనుసంధానిస్తూ బౌద్ధ సర్క్యూట్, శ్రీశైలం తదితర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వ సిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద ప్రతిపాదించిన రూ.9,180 కోట్ల విలువైన 60 ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, అభివృద్ధి ప్రణాళికల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్ల సీఈఓలు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్ 2న మూడో దశ పంచాయతీ ఎన్నికలు



-మొదటిపేజీ తరువాయి

కానుంది.

ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్

డిసెంబర్ 2న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. మూడో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామ పంచాయతీల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసే అవకాశం ఉంది.

రాప్తాడు బాలిక ఫైటర్..
త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యం!



బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాప్తాడు బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోంది. ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక త్వరలోనే పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తుందని మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినంత మాత్రాన తన బాధ్యత ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. బాలిక మునుపటిలా నవ్వుతూ, సంతోషంగా సాధారణ జీవితం గడిపే వరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఉండవల్లిలోని తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. బాలికకు అందుతున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలిక వేగంగా కోలుకుంటోందని వైద్యులు వెల్లడించడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

వెంటిలేటర్ అవసరం లేకుండా శ్వాస

బాలిక ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని లోకేశ్ తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్ అవసరం లేకుండానే శ్వాస తీసుకుంటోందని, నోటి ద్వారా ఆహారం తీసుకుంటోందని వివరించారు. చిన్నపాటి గాయాలకు చికిత్స కొనసాగుతోందని, ఇతరుల సహాయంతో నెమ్మదిగా నడుస్తోందని వైద్యులు వెల్లడించారు. రాయడానికి అవసరమైన శిక్షణ కూడా ప్రారంభించినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం నవ్వమని అడిగితే బాలిక చిరునవ్వు చిందించిందని పేర్కొన్నారు.

డిశ్చార్జ్ తర్వాతా ప్రత్యేక వైద్య సంరక్షణ

బాలిక ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా వైద్య సంరక్షణలో ఎలాంటి లోటు ఉండకూడదని మంత్రి సూచించారు. స్థానికంగా మానసిక వైద్య నిపుణుడిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతపురం ఆసుపత్రి సహకారంతో ప్రత్యేక థెరపిస్ట్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంటి వద్ద ఇన్ఫెక్షన్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

భవిష్యత్తు చికిత్సకు సమగ్ర ప్రణాళిక

బాలికకు భవిష్యత్తులో అవసరమయ్యే శస్త్రచికిత్సలపై ముందుగానే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని వైద్యులకు సూచించారు. చికిత్సతో పాటు మానసికంగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

వైద్య బృందానికి కృతజ్ఞతలు

"బాలిక మళ్లీ తోటి పిల్లలతో కలిసి సంతోషంగా గడపాలి. తను పూర్తిగా కోలుకునే వరకు బాధ్యత తీసుకుంటాను" అని లోకేశ్ భరోసా ఇచ్చారు. బాలికను నిజమైన ఫైటర్‌గా అభివర్ణించిన వైద్యుల మాటలకు ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. బాలిక ప్రాణాలు కాపాడి, కోలుకునేందుకు కృషి చేస్తున్న వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి నుంచి ఇంటికి చేరిన తర్వాత కూడా ఆమె ఆరోగ్యం, పునరావాసంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

ఎంపీపీ ఎన్నికల వేళ ఉత్కంఠ.. పలు మండలాల్లో వాయిదా

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఉపాధ్యక్షుల ఎన్నికల సందర్భంగా పలు జిల్లాల్లో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి, వైఎస్సార్‌సీపీ మధ్య బలాబలాలు సమానంగా ఉండటం, సభ్యులు ఎన్నికల సమావేశాలకు హాజరుకాకపోవడం, కోరం లేకపోవడం, ఎంపీటీసీ సభ్యులు వర్గాలుగా విడిపోవడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం వంటి కారణాలతో పలు మండలాల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మరికొన్ని చోట్ల తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో అధికారులు ఎన్నికల ప్రక్రియను నిలిపివేశారు. వాయిదా పడిన స్థానాల్లో శుక్రవారం తిరిగి ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

కోరం లేక నిలిచిన ఎన్నికలు

కృష్ణా జిల్లా మచిలీపట్నం ఉత్తర, దక్షిణ మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు కోరం లేక వాయిదా పడ్డాయి. మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినప్పటికీ సభ్యులెవరూ హాజరుకాలేదు. మంత్రి కొల్లు రవీంద్ర సోదరి నడకుదిటి శేష మల్లేశ్వరి మృతి నేపథ్యంలో టీడీపీ, జనసేన ఎంపీటీసీ సభ్యులు ఎన్నికలకు దూరంగా ఉన్నట్లు సమాచారం. దీంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేసి, శుక్రవారం నిర్వహించేందుకు నిర్ణయించారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోనూ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలుండగా, కూటమి తరపున 15 మంది ఏకగ్రీవమయ్యారు. అయినప్పటికీ ఎన్నికల సమావేశానికి సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

కనిగిరి పరిధిలో నాలుగు మండలాల్లో వాయిదా

మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గ పరిధిలోని కనిగిరి, హనుమంతునిపాడు, పెద్దచెర్లపల్లి, వెలిగండ్ల మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలంలోనూ ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. ఆయా మండలాల్లో శుక్రవారం తిరిగి ఎన్నికలు నిర్వహించనున్నారు.

మంత్రాలయంలో టీడీపీ, జనసేన మధ్య పదవి పంచాయితీ

కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఎంపీపీ పదవి విషయంలో టీడీపీ, జనసేన మధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయి. జనసేనకు ఎంపీపీ పదవి కేటాయించేందుకు టీడీపీ ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి అంగీకరించలేదని సమాచారం. టీడీపీకే



ఎంపీపీ పదవి ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని 18 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీకి 10, జనసేనకు ఒకటి, వైఎస్సార్‌సీపీకి ఏడు స్థానాలు దక్కాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రక్రియను శుక్రవారానికి వాయిదా వేశారు.

వెంకటగిరిలో సమాన బలాబలాలు

తిరుపతి జిల్లాలోని వెంకటగిరి మండలంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ మధ్య బలాబలాలు సమానంగా ఉండటంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. రిటర్నింగ్ అధికారి శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

పులివెందులలో రిజర్వేషన్ సమస్య

పులివెందులలో ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా ఎంపీపీ అధ్యక్ష పదవికి అర్హత కలిగిన ఎంపీటీసీ సభ్యుడు అందుబాటులో లేకపోవడంతో ఎన్నిక నిర్వహణ సాధ్యం కాలేదు.

పగిడ్యాలలో టీడీపీలో వర్గపోరు

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలో టీడీపీ ఎంపీటీసీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోవడంతో ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఎన్నికల ప్రక్రియను నిలిపివేశారు.

శ్రీకాకుళం జిల్లాలోనూ కోరం కొరత

శ్రీకాకుళం గ్రామీణ, గార మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలకు అవసరమైన కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. భోగాపురం మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సభ్యులు హాజరుకాకపోవడంతో రిటర్నింగ్ అధికారులు ఎన్నికలను శుక్రవారానికి వాయిదా వేశారు.

బాపట్ల, కొత్తపల్లిలో వాగ్వాదాలు

బాపట్ల మండలంలో ఎంపీపీ ఎన్నికల సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు ఆటంకాలు కలిగించడంతో ఎన్నిక వాయిదా పడింది. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లిలోనూ ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో అధికారులు ప్రక్రియను నిలిపివేశారు.

శుక్రవారంపై ఉత్కంఠ

పలు మండలాల్లో ఎన్నికలు వాయిదా పడటంతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది. కూటమి పార్టీల మధ్య పదవుల పంపకం, సభ్యుల మధ్య అంతర్గత విభేదాలు, సమాన బలాబలాలు వంటి అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి. శుక్రవారం నిర్వహించనున్న ఎన్నికల్లో ఏయే మండలాల్లో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది.

మిగులు జలాలపై హక్కులు రావు

హైదరాబాద్, నవంబర్ 19: కృష్ణా నదిపై కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక సూచనలు చేసింది. ముందస్తు అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టవద్దని స్పష్టం చేసింది. కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి సంబంధించిన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 అవార్డు వెలువడే వరకు చట్టబద్ధమైన విధానాలను తప్పనిసరిగా పాటించాలని రెండు రాష్ట్రాలకు లేఖ రాసింది. కొత్త ప్రాజెక్టులను చేపట్టే ముందు వాటికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించాలని కేఆర్ఎంబీ సూచించింది. బోర్డు ముందస్తు అనుమతి పొందిన తర్వాతే అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తీసుకోవాలని స్పష్టం చేసింది. అనుమతులు లేకుండా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది.

తెలంగాణ వైఖరిపై బోర్డు వ్యాఖ్యలు

కేఆర్ఎంబీ పరిధిని సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాలు చేసిన విషయాన్ని బోర్డు తన లేఖలో ప్రస్తావించింది. బోర్డు పరిధినే ప్రశ్నిస్తూ, అదే సమయంలో వివాదాల పరిష్కారానికి బోర్డు జోక్యం కోరడం పరస్పర విరుద్ధమైన వైఖరని వ్యాఖ్యానించింది.

ఏకాభిప్రాయం లేకుండా నిర్ణయాలు కష్టం

బోర్డులో ఏకాభిప్రాయం ఏర్పడకుండా వివాదాస్పద అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం కష్టమని కేఆర్ఎంబీ పేర్కొంది. బోర్డు తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో రాష్ట్రాలు విఫలమైతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది.

మిగులు జలాలపై హక్కులు రావు

నదిలో మిగులు జలాలు ఉన్నాయనే అంచనా ఆధారంగా వాటిని వినియోగించుకునే హక్కులు రాష్ట్రాలకు సంక్రమించవని బోర్డు తేల్చిచెప్పింది. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయడం సంబంధిత ట్రిబ్యునల్ పరిధిలోని అంశమని స్పష్టం చేసింది. ట్రిబ్యునల్ నిర్ణయాలు, చట్టబద్ధ నిబంధనలకు అనుగుణంగానే నీటి వినియోగం జరగాలని సూచించింది. కృష్ణా జలాల పంపిణీ, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో కేఆర్ఎంబీ తాజా లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. బోర్డు సూచనలపై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన





ఏలూరు, నవంబర్ 19 (మీ వార్త ప్రతినిధి): జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు ఏలూరులోని ట్రాఫిక్ క్రాస్ రోడ్ పార్క్ వద్ద సుమారు 200 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రహదారి భద్రత ప్రాముఖ్యతను వివరిస్తూ, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం, రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీబ్రా క్రాసింగ్‌ను వినియోగించడం, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి మాత్రమే కాకుండా, మన ప్రాణాలను మరియు ఇతరుల ప్రాణాలను కాపాడటానికి రూపొందించబడ్డాయని ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే రహదారి భద్రతా నియమాలను అలవర్చుకోవాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు.
రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం, ప్రమాదాలను నివారిద్దాం, విలువైన ప్రాణాలను కాపాడుకుందాం అనే సందేశంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాలలు,అన్ని కళాశాలలు ఇంటర్, డిగ్రీ,ఫార్మసీ ఇంజనీరింగ్ మెడిసిన్ విద్యార్థిని సందర్శించాలి అని ప్రతి విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ ను అవగాహనను కల్పించే నిమిత్తముగా ట్రాఫిక్ పార్క్ లో కల్పించినటువంటి అవగాహనను విద్యార్థుల విద్యార్థులు చూపించాలని దాని నిమిత్తం ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గారి యొక్క ఫోన్ నెంబర్ 9440404037 ను సంప్రదించవలసినదిగా తెలియ చేసినారు.

రౌతులపూడి మండల అధ్యక్ష పీఠం టిడిపి కైవసం





1. మండల పరిషత్ అధ్యక్షులుగా తమరాల సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా సింహాద్రి సూర్యనారాయణ రాజు ప్రమాణ స్వీకారం.

2. శుభాకాంక్షలు అభినందనలు తెలియజేసిన ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా.

3. పోలీసుల పటిష్ట భద్రతలో ప్రశాంతంగా ప్రత్యేక సమావేశం

రౌతులపూడి నవంబర్ 19:(మీ వార్త న్యూస్ ప్రతినిధి రౌతులపూడి మండల పరిషత్ అధ్యక్ష పదవి టిడిపి కైవసం చేసుకుంది. మండలంలో నవంబర్ 5వ తేదీన జరిగిన ఎన్నికలలో 16 స్థానాలకు గాను 14 స్థానాలలో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ ఎంపీపీ మరియు వైస్ ఎంపీపీ పదవులను తన ఖాతాలో వేసుకుంది. ఎన్నికల అధికారి కే.సూరిబాబు, మండల అభివృద్ధి అధికారి జి శివరామకృష్ణయ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 16 ఎంపీటీసీలకు గాను 14 మంది ఎంపీటీసీలు సమావేశానికి హాజరయ్యారు. రౌతులపూడి -1, మరియు రౌతులపూడి -2 ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు.మొదట ఎన్నికల అధికారి ఎంపీటీసీ సభ్యులందరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశానికి హాజరైన ఎంపీటీసీ సభ్యులందరూ తెలుగుదేశం పార్టీ నుండి రాఘవపట్నం ఎంపీటీసీ గా పోటీ చేసి విజయ సాధించిన తమరాల సత్యనారాయణ పేరును మండల పరిషత్ అధ్యక్షులుగాను, పి చామవరం గ్రామం నుండి అదే తెలుగుదేశం పార్టీ నుండి పోటీ చేసి ఎంపీటీసీ సభ్యులుగా గెలిచిన సింహాద్రి సూర్యనారాయణ ను ఉపాధ్యక్షులుగా ప్రతిపాదించారు. దీనిని అందరూ ఆమోదించడంతో మండల పరిషత్ అధ్యక్షులుగా తమరాల సత్యనారాయణ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా సింహాద్రి సూర్యనారాయణ చేత అధికారులు ప్రమాణస్వీకారం చేయించి పత్రాలు అందజేశారు. గిడజాం గ్రామం నుండి వైయస్సార్ పార్టీ నుండి ఎంపీటీసీ సభ్యురాలు గా ఎన్నికైన తిరుమరెడ్డి సత్యవేణి తమరాల సత్యనారాయణ ను ఎంపీపీగా మద్దతు తెలియజేశారు. రికార్డులలో అందరి చేత అధికారులు సంతకాలు తీసుకున్నారు. ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా ఎంపీపీ తమరాల సత్యనారాయణ ను, వైస్ ఎంపీపీ సింహాద్రి సూర్యనారాయణ ను మరియు మిగతా ఎంపీటీసీ సభ్యులందరికీ పూలదండలు వేసి సాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులందరూ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



జి.మాడుగుల ఎంపీపీగా గబ్బాడి శాంతికుమారి ఏకగ్రీవ ఎన్నిక

వైస్ ఎంపీపీగా ఇండిపెండెంట్ ఎంపీటీసీ కిడారి రమేష్

జి.మాడుగుల(మీ వార్త ప్రతినిధి) జి.మాడుగుల మండల పరిషత్ అధ్యక్షురాలిగా కూటమి (టీడీపీ) అభ్యర్థి గబ్బాడి శాంతికుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీగా ఇండిపెండెంట్ ఎంపీటీసీ సభ్యుడు కిడారి రమేష్ ఎన్నికయ్యారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు. మండల ఎన్నికల అధికారిగా విద్యాసాగర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా రాజ్‌కుమార్ ప్రశాంతంగా నిర్వహించారు. జిమాడుగుల 15 సెగ్మెంట్లకు ఎన్నికైన ఎంపీటీసీలను ప్రమాణస్వీకార కార్యక్రమంతో ప్రారంభించి అనంతరం ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఎంపీపీ ఎన్నిక నిర్వాహణకు జి.మాడుగుల-2 ఎంపీటీసీ సభ్యురాలు గబ్బాడి శాంతికుమారి పేరును జి.మాడుగుల-1 ఎంపీటీసీ సభ్యుడు మత్స్యరాస,నారాయణరాజు. ప్రతిపాదించగా, కె.కోడాపల్లి ఎంపీటీసీ సభ్యుడు కొండపల్లి పిన్నయ్య బలపరిచారు. ఐదుగురు టీడీపీ, ముగ్గురు ఇండిపెండెంట్ ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి మద్దతు తెలిపారు. వైకాపా నుంచి పోటీ లేకపోవడంతో శాంతికుమారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.
అనంతరం నిర్వహించిన వైస్ ఎంపీపీ ఎన్నికలో ఇండిపెండెంట్ అభ్యర్థి కిడారి రమేష్, వైకాపా అభ్యర్థి తలారి వెంకటరమణ పోటీ పడ్డారు. రమేష్ అభ్యర్థిత్వాన్ని ఎం.నారాయణరాజు ప్రతిపాదించగా, కోరాపల్లి ఇండిపెండెంట్ ఎంపీటీసీ సభ్యుడు చిన్న కొండబాబు బలపరిచారు. ఆయనకు ఎనిమిది మంది సభ్యులు మద్దతుగా చేతులెత్తారు. వైకాపా అభ్యర్థి తలారి వెంకటరమణను సింగర్భ ఎంపీటీసీ సభ్యుడు పాంగీ రామకృష్ణ ప్రతిపాదించగా, గడుతూరు ఎంపీటీసీ సభ్యుడు బోనంగి మచ్చ కొండబాబు బలపరిచారు. ఆయనకు ఏడుగురు సభ్యులు మద్దతు తెలిపారు. దీంతో ఎనిమిది ఓట్లతో కిడారి రమేష్ వైస్ ఎంపీపీగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.



అనంతరం నూతన ఎంపీపీ గబ్బాడి శాంతికుమారితో ప్రమాణ స్వీకారం చేయించి, తొలి మండల పరిషత్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శాంతికుమారి మాట్లాడుతూ తనను ఎంపీపీగా ఎన్నుకున్న మండల ప్రజలకు, ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని, ముఖ్యంగా రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. పార్టీలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి చేస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతగిరి పీఠంపై వైఎస్ఆర్సీపీ జైత్రయాత్ర..

సస్పెన్స్‌కు తెర!

ఎంపీపీగా సిరగం భమల ఏకగ్రీవ ఎన్నిక.







అనంతగిరి,నవంబర్ 19 (మీ వార్త) ఎన్నో రోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఉత్కంఠకు తెరపడింది.అనంతగిరి మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) పీఠం వైఎస్ఆర్సీపీ వశమైంది. అనంతగిరి మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మొత్తం స్థానాలను కైవసం చేసుకుని వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ అభ్యర్థి సిరగం భమల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.ఉప మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా కోటపర్తి ఎర్రయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం రిటర్న్ అధికారి ఎస్ స్వామి నాయుడు చేతుల మీదుగా అధికారికంగా నియామక పత్రాలు అందజేశారు.అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వామి నాయుడు ఎంపీడీవో ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో మొదటి సమావేశాన్ని నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష,ఉపాధ్యక్షులు మాట్లాడుతూ..తమపై నమ్మకంతో ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీలకతీతంగా మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని,ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీగా పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

నరేంద్రపురం కూటమి సర్పంచ్ అభ్యర్థిగా తిరుమనాధం శ్రీకాంత్ నామినేషన్!

ప్రజల సమస్యలే నా ధ్యేయం.. అభివృద్ధే నా లక్ష్యం!

భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు.. అభిమానుల కేరింతల మధ్య సందడి





పి గన్నవరం మీవార్త ప్రతినిధి (నవీన్)
డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కూటమి తరపున తిరుమనాధం శ్రీకాంత్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, “ప్రజల సమస్యలే నా ధ్యేయం.. అభివృద్ధే నా లక్ష్యం” అని స్పష్టం చేశారు. నరేంద్రపురం గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. “గ్రామ అభివృద్ధి కోసం.. ప్రజల సంక్షేమం కోసం.. మీతోనే నేను” అంటూ ఓటర్లను కోరారు.పార్టీలకు అతీతంగా, గ్రామంలోని ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పని చేస్తానని, నరేంద్రపురం ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన అన్నారు.నామినేషన్ కార్యక్రమంలో అభిమానులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు నెంబర్ గా నామినేషన్ దాఖలు చేసిన మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోరుకొండ జాన్.కెజెఆర్



పి గన్నవరం మీవార్త ప్రతినిధి (నవీన్) పి గన్నవరం నుండి నవంబర్ 19 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామపంచాయతీ 14వ వార్డు నెంబర్ అభ్యర్థిగా మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోరుకొండ జ్ఞానసుందరావు. జాన్. నరేంద్రపురం గ్రామపంచాయతీ 14వ వార్డు నెంబర్ గా నవంబర్ 19వ తేదీ ఉదయం 11 గంటలకు. నరేంద్రపురం సెంటర్లోను అంబటివారిపాలెం ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి. పూలమాల వేసి అనంతరం రిటర్నింగ్ అధికారి. ఎన్ సత్యనారాయణ కు నామినేషన్ పత్రములు దాఖలు చేశారు. ఈ సందర్భంగా కోరుకొండ జాన్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన నరేంద్రపురం గ్రామపంచాయతీ 14వ వార్డు గుత్తులవారిపాలెం గ్రామ పెద్దలకు. నాకు మద్దతుగా వచ్చిన అంబటివారిపాలెం గ్రామ పెద్దలకు అభినందన కృతజ్ఞతలు తెలియజేశారు. నరేంద్రపురం గ్రామపంచాయతీ సెక్రెటరీ బి సత్యనారాయణ వర్మ. బిల్ కలెక్టర్ జి సుబ్రమణ్యం స్వామి. డేటా ఎంట్రీ టెక్నీషియన్ కొంబత్తుల ఏడుకొండలకు. శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో. కుడిపూడి రామకృష్ణ. గుత్తుల రాఘవులు.నూకపై వెంకటేష్. వాసంశెట్టి గోవిందరావు. చప్పిడి నాగరాజు. బూల పెద్దిరాజు. మాత సత్యనారాయణ. బూల రాజేష్. నూకపై రమేష్. కుడిపూడి వెంకట్రావు. చప్పిడి వెంకట్రావు. నూకపై శ్రీను (నల్ల శీను) తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు --

భావితరాలకు భారతీయ సంస్కృతి, ధార్మిక విలువలను అందించే మహత్తర కార్యక్రమం

మచిలీపట్నం నవంబర్ 19(మీ వార్త ప్రతినిధి) విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 22న జిల్లా స్థాయి పోటీలు -- విద్యార్థులు, యువత, మహిళలు, పెద్దలు అందరూ పాల్గొనాలని పిలుపు,భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, ఆధ్యాత్మిక వారసత్వం, నైతిక విలువలను భావితరాలకు అందించాలనే మహత్తర సంకల్పంతో విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నవంబర్ 22వ తేదీన నిర్వహించనున్నారు.గత 30 సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం కేవలం ఒక పోటీగా కాకుండా, భగవద్గీతలోని జీవన సందేశాన్ని ప్రతి ఇంటికి, ప్రతి తరానికి చేరవేసే ధార్మిక, సాంస్కృతిక ఉద్యమంగా రూపుదిద్దుకుంది. భగవద్గీతలోని 18 అధ్యాయాల నుంచి ఎంపిక చేసిన 40 శ్లోకాల ఆధారంగా వివిధ వయస్సుల వారికి ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.భగవద్గీత -- జీవితానికి మార్గదర్శకమైన జ్ఞాన సంపద
భగవద్గీత భారతీయ తాత్విక చింతనకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన అపూర్వమైన జ్ఞాన గ్రంథం. కురుక్షేత్ర యుద్ధభూమిలో శ్రీకృష్ణుడు అర్జునుడికి అందించిన ఉపదేశం కేవలం ఆనాటి పరిస్థితులకు మాత్రమే పరిమితం కాదు. నేటి ఆధునిక సమాజంలో ఎదురయ్యే మానసిక సంఘర్షణలు, బాధ్యతలు, ఒత్తిళ్లు, నిర్ణయాలు, జీవిత సవాళ్లకు కూడా గీతలోని సందేశాలు మార్గదర్శకంగా నిలుస్తాయి.కర్తవ్య నిర్వహణ, నిష్కామ కర్మ, ఆత్మవిశ్వాసం, సమత్వ భావన, క్రమశిక్షణ, ధర్మబద్ధమైన జీవనం వంటి విలువలను భగవద్గీత బోధిస్తుంది. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే ఈ విలువలను అలవర్చుకోవడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన మనుషులుగా ఎదగడానికి అవకాశం ఉంటుంది.
శ్లోక కంఠస్థం -- జ్ఞాపకశక్తికి మించి వ్యక్తిత్వ వికాసం
భగవద్గీత శ్లోకాలను కంఠస్థం చేయడం అనేది కేవలం జ్ఞాపకశక్తిని పరీక్షించే ప్రక్రియ కాదు. శ్లోకాల ఉచ్చారణ, పదాల స్పష్టత, ఏకాగ్రత, నిరంతర అభ్యాసం, క్రమశిక్షణ వంటి అనేక అంశాలను అభివృద్ధి చేసే సాధన.చిన్నపిల్లలు శ్లోకాలను నేర్చుకోవడం ద్వారా భారతీయ భాషా సంపద, సంస్కృత ఉచ్చారణ, సాంప్రదాయ సాహిత్యంపై ఆసక్తి పెంపొందించుకోవచ్చు. యువతకు ఆత్మవిశ్వాసం, మానసిక స్థిరత్వం, లక్ష్యసాధన పట్ల నిబద్ధత వంటి విలువలను గుర్తుచేసే అవకాశం కలుగుతుంది. పెద్దలు, మహిళలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా కుటుంబాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించవచ్చు.
కుటుంబం నుంచి సమాజం వరకు ధార్మిక చైతన్యం
నేటి డిజిటల్ యుగంలో పిల్లలు, యువత ఎక్కువ సమయాన్ని మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, ఇతర వినోద సాధనాలపై వెచ్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, భగవద్గీత వంటి జ్ఞాన సంపదను పరిచయం చేయడం సమాజంలోని ప్రతి కుటుంబం బాధ్యత.పిల్లలు తల్లిదండ్రులతో కలిసి శ్లోకాలను నేర్చుకోవడం, కుటుంబ సభ్యులు పరస్పరం అభ్యసించడం ద్వారా తరాల మధ్య సాంస్కృతిక అనుబంధం బలపడుతుంది. మన సంప్రదాయాలను కేవలం పండుగలకే పరిమితం చేయకుండా, వాటి వెనుక ఉన్న తాత్వికతను అర్థం చేసుకుని ఆచరణలో పెట్టే అవకాశం ఏర్పడుతుంది.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ధార్మిక చైతన్యంతో పాటు సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం, సేవాభావం, సద్భావనలను పెంపొందించడానికి దోహదపడతాయి.
అన్ని వయస్సుల వారికి అవకాశంఈ పోటీలను ఆరు విభాగాలుగా నిర్వహిస్తున్నారు.
. ఎల్.కె.జి. నుంచి 3వ తరగతి వరకు -- 10 శ్లోకాలు.
2. 4వ తరగతి నుంచి 7వ తరగతి వరకు -- 20 శ్లోకాలు.
3. 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు -- 30 శ్లోకాలు.
4. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ విద్యార్థులు -- 40 శ్లోకాలు.
5. మహిళలు -- 40 శ్లోకాలు.
6. పురుషులు -- 40 శ్లోకాలు.పోటీల వివరాలు,తేదీ: 22 నవంబర్ 2026, ఆదివారం,సమయం: ఉదయం 9.00 గంటలకు,వేదిక: కృష్ణవేణి జూనియర్ కళాశాల



ప్రాంగణం, మచిలీపట్నం,ప్రవేశ రుసుము: రూ.20జిల్లా స్థాయి పోటీల అనంతరం రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 25, 2026న విజయవాడలో నిర్వహించబడతాయి.ప్రతి ఇంటి నుంచి ఒకరు -- ప్రతి తరంలో గీతా సందేశం
భగవద్గీతను పూజా మందిరంలో ఉంచడమే కాకుండా, అందులోని సందేశాన్ని మన జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.
భగవద్గీతను చదవడం, వినడం, శ్లోకాలను కంఠస్థం చేయడం, వాటి అర్థాన్ని తెలుసుకోవడం ద్వారా భారతీయ సంస్కృతి పట్ల యువతలో గౌరవం, అవగాహన పెంపొందుతాయని తెలిపారు.కృష్ణా జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని, విద్యార్థులతో పాటు మహిళలు, యువత, పెద్దలు కూడా ఉత్సాహంగా పాల్గొనాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది.భగవద్గీత మన వారసత్వం -- దాని సందేశం మన జీవన మార్గం. భావితరాలకు ఈ జ్ఞాన సంపదను అందించడం మనందరి సామాజిక, సాంస్కృతిక బాధ్యత.కార్యక్రమ నిర్వాహకులు:. డా. బూరగడ్డ శ్రీనాథ్ -- జిల్లా అధ్యక్షులు, వర్రె రాజశేఖర్ -- జిల్లా కార్యదర్శి,కోటి శ్రీకాంత్ -- జిల్లా కోశాధికారి,జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం -- జిల్లా కార్యాలయ ప్రముఖ్ విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి అండగా మంత్రి సుభాష్

కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం మీ వార్తా ప్రతినిధి నవంబర్ 19 :- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం యర్రపోతవరం వంతెన వద్ద జరిగిన విషాదకర ఘటనలో అద్దంపల్లి గ్రామానికి చెందిన వాసా సత్యనారాయణ (70) మృతి చెందడం పట్ల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అద్దంపల్లి గ్రామానికి చెందిన వాసా సత్యనారాయణ రాజమహేంద్రవరంలో నివసిస్తున్న తన చిన్న కుమారుడి వద్దకు వెళ్లేందుకు రామచంద్రపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడిపోయారు. ఈ క్రమంలో బస్సు వెనుక చక్రం ఆయనపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి





తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పామర్రు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విషాద ఘటన గురించి తెలుసుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతుడు వాసా సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన మంత్రి.. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబం ఒంటరి కాదని, వారికి ప్రభుత్వం, తాను అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యతని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపి భారీ విజయం సాధిస్తుంది.





మాజీ వైసీపీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు..

జీలుగుమిల్లి, (మీ వార్త ప్రతినిధి) మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ వైసిపి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, హాజరయ్యారు. గెలిచిన ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించి అందరిని అభినందించారు. వైసిపి ఎంపీపీగా, సున్నం ఉషారాణి, వైస్ ఎంపీపీ గా వీరంకి నాగలక్ష్మి, లను ఏడుగురు వైసిపి ఎంపీటీసీల తో టిడిపి ఎంపీటీసీ. జనసేన ఎంపీటీసీ లతో ఎన్నికల అధికారి సాయి బుచ్చారావు ప్రమాణ స్వీకారం చేయించారు.
అనంతరం నూతన ఎంపీపీ ఎంపీటీసీ సభ్యులు నాయకులకు అభినందనలు తెలియజేశారు . ఈ కార్యక్రమానికి మాజీ వైసిపి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు జడ్పీటీసీలను రెండు ఎంపీపీలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమ వ్యక్తం చేశారు, కూటమి ప్రభుత్వం మీద ప్రజలు విసుకు చెందారని అన్నారు. ఏ సంక్షేమ పథకం ప్రజలకు అందడం లేదని అన్నారు. రానున్న సర్పంచి ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కొరస సూరమ్మ. వైసిపి మండల అధ్యక్షుడు చందా ప్రసాద్. టౌన్ ప్రెసిడెంట్ చిట్టి బొమ్మ శ్రీనివాసరావు .నాయకులు కొల్లూరి రాంబాబు .బోధ శ్రీనివాసరెడ్డి. కోర్స వెంకటేశ్వరావు. సున్నం సురేష్. కక్కిరాల చక్రి. బూరుగు ప్రేమ్ కుమార్. వనమ రామకృష్ణ. రాఘవరెడ్డి. ఘంటసాల గాంధీ. కొప్పుల ప్రసాద్. పాల్గొన్నారు.

గోపాష్టమి సందర్భంగా కొండవరంలో ఘనంగా గోపూజ



మొవ్వ నవంబర్ 19(మీ వార్త ప్రతినిధి) విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు
మొవ్వ మండలం, కొండవరం గ్రామంలోని శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయంలో గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని 2026 నవంబర్ 19వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వహిందూ పరిషత్ (వి హెచ్ పి) కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమం నిర్వహించారు.హిందూ సంప్రదాయంలో గోమాతకు విశిష్టమైన స్థానం ఉందని, గోసంరక్షణ అనేది భారతీయ సంస్కృతి, వ్యవసాయ సంప్రదాయం, జీవకారుణ్యంతో ముడిపడిన పవిత్ర బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.గోపాష్టమి పర్వదినం గోమాత పట్ల కృతజ్ఞతను, భక్తిని, గౌరవాన్ని చాటిచెప్పే పవిత్ర సందర్భమని, ప్రతి గ్రామంలో ఇటువంటి ధార్మిక కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక చైతన్యాన్ని, గోసంరక్షణ పట్ల అవగాహనను పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా దేవభక్తి -- దేశభక్తి -- గోసంరక్షణ అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని తెలిపారు.జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం
కార్యాలయ ప్రముఖ్ విశ్వహిందూ పరిషత్, కృష్ణా జిల్లా

ఎంపీపీ, ఉప ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం



పుల్లలచెరువు, నవంబర్ 19 (మీ వార్త) పుల్లలచెరువు మండల ఎంపీపీ గా కాకర్ల వరలక్ష్మి, వైస్ ఎంపీపీ గా కాకర్ల కోటయ్య ను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. పుల్లలచెరువు మండల పరిషత్ కార్యాలయంలో మండల ఆర్ ఓ వెంకటరమణ కొత్తగా ఎన్నికైన 15 ఎంపీటీసీ ల చేత గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎన్నిక జరిగింది. సభ్యులు ఏకగ్రీవంగా కాకర్ల వరలక్ష్మి కోటయ్య కు ఆమోదం తెలిపి ఎంపీపీ గా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మరియదాస్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండల కన్వీనర్ పోట్ల గోవిందు, మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణ రెడ్డి, కూటమి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంపీపీ నీ శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

గూడూరు మండల ఎంపీపీగా బొల్లా రాజేష్ ఏకగ్రీవ ఎన్నిక! 13 మంది ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం



గూడూరు నవంబర్ 19(మీ వార్త ప్రతినిధి) గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. మండలంలోని మొత్తం 14 అందులో 13 మంది ఎంపీటీసీలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 13 మంది ఎంపీటీసీలు కలిసి ఏకగ్రీవంగా అకుమర్రు ఎంపీటీసీ బొల్లా రాజేష్ ను మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ బొల్లా రాజేష్ ని మండల ఆఫీస్ లోని ఎంపీటీసీలు పుష్ప గుచ్చలు శాలవాలతో కప్పి ప్రతి ఒక్కరు అభినందనలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన ఎంపీపీ బొల్లా రాజేష్ మాట్లాడుతూ... మండల అభివృద్ధికి కృషి చేస్తానని, అందరినీ కలుపుకుని పోతానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నూతన ఎంపీపీకి, ఎంపీటీసీలకు అభినందనలు వెల్లువెత్తాయి.ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీటీసీలు:

1. నందం నరసింహారావు – రాయవరం
2. నలిగిలి కిరణ్ కుమార్ – గూడూరు – ×
3. పలగాని కనకదుర్గ – మల్లవోలు – ×
4. పెచ్చుక వాసు వెంకట దుర్గ – పోలవరం
5. పృథ్వి బాల శ్రీనివాసరావు – ఇడుగుళ్ళపల్లి
6. పేరే చినస్వామి – పోసినవారిపాలెం
. 7.
8. బాకీ లీలా పావని – ఆకులమన్నాడు
9. బాదర్ల నాగ శివ అనూష – మల్లవోలు – ××
10. బొల్లా రాజేష్ – ఆకు మర్రు (ఎంపీపీ)
11. యక్కల పీతాంబరధరరావు – కప్పలదొడ్డి
12. యార్లగడ్డ కళ్యాణి – కంకటవ
13. లింగం రాజ్యలక్ష్మి – తాళ్ళకటూరు
14. సమ్మెట లక్ష్మీ శైలజ – ముక్కొల్లు

అట్టహాసంగా రామచంద్రపురం రూరల్, కె గంగవరం, కాజులూరు మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీల ప్రమాణ స్వీకార మహోత్సవం





అధికారం అంటే హోదా కాదు.. ప్రజలకు మరింత సేవ చేసే బాధ్యత ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలి

నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం/ కె.గంగవరం/కాజులూరు మీ వార్తా **ప్రతినిధి నవంబర్ 19:-** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోసం జిల్లా రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో నూతనంగా ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు ప్రమాణ స్వీకార మహోత్సవాలు అత్యంత అట్టహాసంగా, పండుగ వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఆయా మండలాల్లో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రపురం రూరల్ మండల ఎంపీపీగా డాక్టర్ మడకా రాంబాబు, వైస్ ఎంపీపీగా కొండేటి జానకిరామయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల ప్రత్యేక అధికారి బి. నాగకుమార్, ఎంపీడీవో పద్మజ్యోతి సమక్షంలో నూతన ప్రజాప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కె.గంగవరం మండల ఎంపీపీగా చుండ్రు సూర్యకుమారి, వైస్ ఎంపీపీగా కొప్పిశెట్టి సతీష్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల ప్రత్యేక అధికారి జి.ఎస్. రామ్ గోపాల్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాజులూరు మండల ఎంపీపీగా చందాల ఆదినారాయణ, వైస్ ఎంపీపీగా పోలిశెట్టి సీతామహాలక్ష్మి ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ప్రత్యేక అధికారి ఆర్. విజయరాజు, ఎంపీడీవో జె. రాంబాబు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ మూడు మండలాల్లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కుల రిశ్వంత్ రాయ్, రామచంద్రపురం మున్సిపల్ వైర్మన్ మేడిశెట్టి శేషారావు, చిక్కాల దొరబాబుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించడం ఎంతో గర్వకారణమని, అదే సమయంలో ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేయాల్సిన గురుతర కర్తవ్యమని అన్నారు. అధికారం అంటే కేవలం హోదా, పదవి కాదని.. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు లభించిన గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రతి ఒక్కరూ నిలబెట్టుకోవాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పట్టి ఘన విజయాన్ని అందించారని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన



సాగించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యుల పాత్ర కీలకమని, అందరూ సమన్వయంతో పనిచేస్తూ తమ మండలాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీర్వాదంతో పదవులు వచ్చాయి.. ప్రజల మన్ననలు పొందేలా సేవలందించాలి. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆదర్శంగా నిలవాలని నూతన ప్రజాప్రతినిధులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ జెడ్పిటిసి టేకుమూడి సుజాత, కే గంగవరం జడ్పిటిసి రవ్వా సీతామహాలక్ష్మి, కాజులూరు జడ్పిటిసి కూటి శేషరత్నం లు హాజరయ్యారు. మూడు మండలాల్లో నూతన ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. పలువురు నాయకులు, కార్యకర్తలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీకి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభినందనలు





పి గన్నవరం మీవార్త ప్రతినిధి (నవీన్) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలంలో ఈరోజు నిర్వహించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన పి.గన్నవరం ఎంపీపీగా శ్రీమతి కటికల రజిత, వైస్ ఎంపీపీగా శ్రీమతి చిల్లా ఝాన్సీ రాణిని పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గిడ్డి సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్ రాజకుమార్



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా జిమాడుగుల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిమాడుగుల తహసీల్దార్ జి రాజ్ కుమార్. ఎన్నికల నోటిఫికేషన్ రెండవ విడతలో జిమాడుగుల మండల గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను స్థానిక జిమాడుగుల స్వర్ణ, వార్డు కార్యాలయం లో ఏర్పాటు చేశారు. ఈ స్వర్ణ , వార్డు కార్యాలయంలో పాలమామిడి ,సింగర్భ ,జిమాడుగుల, పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో జిమాడుగుల మండల తహసిల్దార్ రాజకుమార్ నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించారు. నామినేషన్లు జరుగుతున్న ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల కేంద్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు..

అట్టహాసంగా మాచవరం సర్పంచ్ అభ్యర్థి గా దొమ్మేటి సత్యమోహన్ నామినేషన్

భారీగా తరలివచ్చిన గ్రామ ప్రజలు

అడుగడుగునా బ్రహ్మరథం









అంబాజీపేట, నవంబర్ 19 (మీ వార్త విలేఖరి): మాచవరం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా దొమ్మేటి సత్యమోహన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రచారంలో దారి పొడవునా ప్రజల నుంచి ఆయనకు విశేష స్పందన లభించింది. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అక్కడనుండి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం వాటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు నుండి ఆయనకు విశేష స్పందన లభించింది.పలువురు మహిళలు హారతులు ఇచ్చి అతనిని ఆశీర్వదించారు. పార్టీలకు అతీతంగా అయనకు పలువురు మద్దత్తు తెలిపారు. ముఖ్యంగా యువత అయన గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పేరి కామేశ్వరరావు, నేలపూడి స్టాలిన్ బాబు ,మాజీ ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పేరి శ్రీనివాసరావు, శీలం సత్య అర్జున్ మోహన్ రావు, మండల వైసీపీ అధ్యక్షులు విత్తనాల శేఖర్, కొర్లపాటి కోటబాబు సూదాబత్తుల రాము ,చింతా రాజేంద్రప్రసాద్,గోసంగి సత్యనారాయణ, ముత్తాబత్తుల పవన్ కుమార్, సాధనాల బాలకృష్ణ తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో మూడు వార్డ్ లు ఏకగ్రీవం



తాడేపల్లిగూడెం నవంబర్ 19 (మీ వార్త ప్రతినిధి) తాడేపల్లిగూడెం పురపాలక సంఘం వార్డు మెంబర్ల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉపసంహరణ అనంతరం ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు ప్రకటించారు. 11వ వార్డులో వైసీపీ అభ్యర్థులు కొమ్మూరి ధనలక్ష్మి, కొమ్మూరి కుసుమ కుమారి, జనసేన పార్టీ తరపున పిడుగు రామలక్ష్మి వారి నామినేషన్లు ఉపసంహరించుకున్న కారణంగా పిడుగు గీతా స్రవంతి జనసేన పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 12వ వార్డులో వైసీపీ అభ్యర్థి దాసం గణపతి, జనసేన పార్టీ నుంచి గంధం గోవిందు వారి నామినేషన్లు ఉపసంహరించుకున్న కారణంగా పైబోయిన కిరణ్ కుమార్ జనసేన పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 21వ వార్డులో వైసీపీ అభ్యర్థి పట్నాల గణపతి, పట్నాల గౌరీ, జనసేన పార్టీ నుంచి పోలిశెట్టి సుబ్బారావు, ఇండిపెండెంట్ అభ్యర్థి లింగంపల్లి సత్యనారాయణ ఉపసంహరించుకున్నందున జనసేన పార్టీ తరపున వర్తనపల్లి కాశీ విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరికీ కమిషనర్ ఏసుబాబు ఎంపిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల జోరు



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) ఈనెల 29వ తేదీన జరిగే రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సర్పంచ్, వార్డు మెంబర్ల ,నామినేషన్ల ప్రక్రియ జిమాడుగుల మండల పరిధిలో జోరు అందుకున్నాయి. గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు, మెంబెర్స్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో జీ మాడుగుల మండలంలో మొదటి రోజు బుధవారం సర్పంచ్ ఎన్నికకు 18 మంది నామినేషన్లు వేయగా, వార్డు మెంబర్స్ గా 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు. రెండో రోజైన గురువారం సర్పంచ్ ఎన్నికకు 38 మంది మండల పరిధిలో నామినేషన్లు వేయగా, వార్డు మెంబర్స్ గా 95 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మండల పరిధిలో మొత్తం సర్పంచ్ ఎన్నికకు 56 మంది. వార్డు మెంబర్స్ గా 117 మంది నామినేషన్లు దాఖలు అయినట్టు మండల ఎన్నికల అధికారి రాజకుమార్ తెలియజేశారు..

శంకర్ పల్లి ఏఎంసి కార్యాలయంలో ఘనంగా స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలు..

శంకర్ పల్లి: నవంబర్ 19(స్వచ్ఛ తెలంగాణ) శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో దేశ మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, శంకర్ పల్లి పిఏసిఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ పార్శి బాలకృష్ణ, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, మోకిల పిఏసిఎస్ చైర్మన్ గౌంద్ర సత్యం, శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కా శెట్టి చంద్రమోహన్, రంగారెడ్డి జిల్లా పిసిసి ఉపాధ్యక్షులు చేకూర్త గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



కట్కూరు ఎంపీటీసీ నామినేషన్లపై వివాదం.. కూటమి నాయకుల ఆందోళన!

వేలేరుపాడు నవంబర్ 19(మి వార్తా ప్రతినిధి) : మండలం కట్కూరు ఎంపీటీసీ స్థానానికి కూటమి, వైసీపీ తరఫున నామినేషన్లు దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు ఒకే గ్రామ పంచాయతీకి చెందిన వారు కావడం, అదే సమయంలో పీసా కమిటీలో కీలక పదవుల్లో కొనసాగుతుండటం వివాదానికి దారితీసింది. కోయిదా పంచాయతీకి చెందిన బుజారి చిట్టిబాబు రెడ్డి కూటమి బలపరిచిన అభ్యర్థిగా, సోడే సురేష్ వైసీపీ అభ్యర్థిగా ఎంపీటీసీ స్థానానికి నామినేషన్లు దాఖలు చేశారు.అయితే బుజారి చిట్టిబాబు రెడ్డి పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా, సోడే సురేష్ కార్యదర్శిగా కొనసాగుతున్నారని, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందు తమ పీసా కమిటీ పదవులకు రాజీనామా చేయలేదని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. పీసా కమిటీ పదవుల్లో కొనసాగుతున్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు రాజీనామా చేయాలనే నిబంధన తమకు తెలియదని కూటమి నాయకులు పేర్కొంటున్నారు.



ఈ నేపథ్యంలో సంబంధిత నిబంధనలను పరిశీలించకుండానే అధికారులు ఇద్దరి నామినేషన్లను ఆమోదించారని కూటమి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అభ్యర్థులు రాజీనామా పత్రాలు సమర్పించకపోయినా, సమర్పించినట్లుగా పత్రాలు సృష్టించారనే ఆరోపణలు సైతం చేస్తున్నారు. మరోవైపు పీసా కమిటీ పదవులకు అభ్యర్థులు రాజీనామా చేసిన పత్రాలను ఐటీడీఏ పీఓకు పంపించామని వేలేరుపాడు ఇంచార్జీ ఎంపీడీఓ చెబుతున్నారు. అయితే వేలేరుపాడు టీడీపీ మండల కన్వీనర్ అమరవరపు అశోక్ ఫోన్ ద్వారా ఐటీడీఏ పీఓను వివరణ కోరగా, కట్కూరు ఎంపీటీసీ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థుల రాజీనామా పత్రాలు తమకు అందలేదని పీఓ తెలిపినట్లు కూటమి నాయకులు పేర్కొంటున్నారు.అధికారుల వివరణకు, ఐటీడీఏ పీఓ తెలిపిన సమాచారానికి మధ్య వ్యత్యాసం ఉండటంతో ఈ వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది. దీంతో నామినేషన్ల ఆమోదం, రాజీనామా పత్రాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కూటమి నాయకులు ఆందోళనకు దిగారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెరపైకి వచ్చిన ఈ పీసా కమిటీ రాజీనామాల వివాదం స్థానికంగా రాజకీయ చర్చకు దారితీసింది. సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై ఎలాంటి స్పష్టత ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదు..

అడిషనల్ డీఆర్డీఏ విచారణలో తేటతెల్లం..

ముదిమాణిక్యం ఫీల్డ్ అసిస్టెంట్‌పై చేసినవి తప్పుడు ఆరోపణలేనని తేల్చిన కూలీలు..

వ్యక్తిగత భూ తగాదాలతో అధికారులను,కూలీలను ఇబ్బంది పెట్టడం సరికాదని హితవు....





చిగురుమామిడి నవంబర్ 19 (మీ వార్త విలేకరి సొన్నాయిల భరత్):
ముదిమాణిక్యం గ్రామంలో వి.బి.జి. రాంజీ (ఉపాధి హామీ) పథకం పనుల్లో ఎలాంటి బినామీ హాజరులు నమోదు కాలేదని,ఫీల్డ్ అసిస్టెంట్‌పై చేసిన ఆరోపణల్లో నిజం లేదని అడిషనల్ డీఆర్డీఏ కృష్ణ నిర్వహించిన విచారణలో తేలింది.గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పచ్చిమట్ల మధుసూదన్ గౌడ్ ఉపాధి హామీ పనుల్లో బినామీలకు హాజరు వేశారంటూ గారబోయిన బాలమల్లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ ఆరోపణలపై అడిషనల్ డీఆర్డీఏ కృష్ణ గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ తోపాటు ఫిర్యాదుదారుడు,ఫీల్డ్ అసిస్టెంట్,ఉపాధి హామీ కూలీల సమక్షంలో బహిరంగ విచారణ చేపట్టారు.ఈ విచారణలో భాగంగా మస్టర్లలో నమోదైన సుమారు 80మంది ఉపాధి హామీ కూలీలను అధికారి స్వయంగా విచారించారు. పనులకు హాజరైన వారికే హాజరు వేశారని,ఎలాంటి అక్రమాలు జరగలేదని కూలీలంతా ముక్తకంఠంతో స్పష్టం చేశారు.ఇరువురి మధ్య ఉన్న వ్యక్తిగత భూమి గెట్టు తగాదాలను మనసులో పెట్టుకుని బాలమల్లు ఈ తప్పుడు ఫిర్యాదు చేశారని వారు తెలిపారు.తమకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిత్యం పనులు కల్పిస్తూ అండగా నిలుస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ మధుసూదన్‌పై నిరాధార ఆరోపణలు చేయడంపై కూలీలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.వ్యక్తిగత కక్షలతో తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారుల సమయాన్ని వృథా చేయడం, కూలీలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఫిర్యాదుదారుడు బాలమల్లుకు అడిషనల్ డీఆర్డీఏ కృష్ణ హితవు పలికారు.భూమి పంచాయతీ విషయంలోనే ఈ ఫిర్యాదు చేయవలసి వచ్చిందని విచారణలో ఫిర్యాదుదారులు తెలిపారు.ఈ విచారణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని రమేష్,ఎంపీడీవో రామ్మోహన చారి,ఏపీవో రాజు, టీఏ శ్రీనివాస్, గ్రామ ప్రజలు,పెద్ద ఎత్తున ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు..

పెంటపాడు ఎంపీపీగా పుల్లా రామలక్ష్మి,వైస్ ఎంపీపీగా పొన్నాడ రామచంద్రరావు ఎంపిక





తాడేపల్లిగూడెం, నవంబర్ 19 (మీ వార్త ప్రతినిధి)
పెంటపాడు మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎంపిక కార్యక్రమం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎం ప్రభాకర్ రావు అధ్యక్షతన జరిగింది. అధ్యక్షుడిగా అల్లంపురం-2 ఎంపిటిసి (జనసేన) పుల్లా వెంకట రామలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా మీనవల్లూరు ఎంపీటీసీ (టీడీపీ) పొన్నాడ రామచంద్రరావు ఎంపికయ్యారు. తొలుత ఎంపిటిసిల చేత ప్రమాణ స్వీకారం చేయించి, అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను చేతులు ఎత్తే పద్ధతిలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులచే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో రిటర్నింగ్ అధికారి ఎం. ప్రభాకర్ రావు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి ఆయన వారికి ఎంపిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాదేశిక నియోజకవర్గ అభివృద్ధికి ఎంపిటిసి సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు తమ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని చెప్పారు. పార్టీలకు అతీతంగా అందరం పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని, ప్రజలు గ్రామ అభివృద్ధి బాధ్యతను అప్పగించి ఓటు వేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పనిచేయాలని గెలుపొందిన ఎంపిటిసి సభ్యులకు తెలిపారు. నూతనంగా ఎంపికైన ఎంపిటిసిలకు అధికారులు తమ వంతు సహకారం పూర్తిగా అందించాలని చెప్పారు. మండల స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సక్రమంగా పనిచేసినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తనబుద్ధి రవికిరణ్, ఎంపిడిఓ ముప్పిడి వెంకటేశు,తహసీల్దార్ వై రవికుమార్, జనసేన పార్టీ పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబీ, నాయకులు మైలవరపు పెదబాబు, కసిరెడ్డి కృష్ణ కన్నయ్య, రుద్ర రమేష్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కోట కళ్యాణి మాధవి



అంబేద్కర్ కోనసీమ జిల్లా గంగవరం మండలం మీ వార్తా ప్రతినిధి నవంబర్ 19:- బాలాంత్రం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కోట చిన్న రాయుడు సతీమణి కోట కళ్యాణి మాధవి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సచివాలయంలో గ్రామస్తులు, పెద్దలతో కలిసి నామినేషన్ పత్రాలు సమర్పించారు. బాలాంత్రం గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని మాధవి చిన్న రాయుడు తెలిపారు. తనకు ఓటు వేసి గెలిపించాలని గ్రామస్తులను కోరారు. సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ మంచి మనసున్న యువకుడు చిన్న రాయుడు గెలిపించాలని స్థానికులను అభ్యర్థించారు.

ఏలేశ్వరం ఎంపీపీ గా మసిరపు రత్నం.





ప్రత్తిపాడు నియోజకవర్గం.
ఏలేశ్వరం:నవంబర్19(మీ వార్త ప్రతినిధి):ఏలేశ్వరం మండలంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో గెలుపొందిన సభ్యులందరూ మండల అధ్యక్ష పదవికి ఎండిఓ కార్యాలయంలో ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికలు నిర్వహించారు.మండల ఎంపీపీగా జె.అన్నవరం నకు చెందిన ఎంపీటీసీ మసిరపు రత్నంను,ఎంపీటీసీ సభ్యులందరూ ఎంపీపీ గా ఎన్నుకునేందుకు తమ ఆమోదాన్ని తెలియజేశారు.మండల ఎంపీపీగా మసిరపు రత్నం ఎన్నికయ్యారు.అలాగే వైస్ ఎంపీపీగా లింగంపర్తికి చెందిన పెంటకోట గంగాభవాని శ్రీధర్ ను ఎంపీటీసీలు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జడ్పిటిసి పైల సుభాష్ చంద్రబోస్,జ్యోతుల పెదబాబు,బొదిరెడ్డి గోపి,బస్స ప్రసాద్,పలివెల వెంకటేశ్వరరావు తదితర నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కౌన్సిలర్ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసిన టిడిపి ఇంచార్జి వలవల బాబ్జి





తాడేపల్లిగూడెం, నవంబర్ 19 (మీ వార్త ప్రతినిధి)
తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు టీడీపీ నియోజకవర్గం ఇంచార్జ్, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) గురువారం బి-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా వలవల బాబ్జి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, తాడేపల్లిగూడెం పట్టణ అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రతి వార్డులో సమస్యలు తెలుసుకుని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని అభ్యర్థులకు సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి, కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం ఎంపీపీగా బేధపూడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీగా ఏపూరి సత్యనారాయణ ఎంపిక

తాడేపల్లిగూడెం, నవంబర్ 19 (మీ వార్త ప్రతినిధి) తాడేపల్లిగూడెం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎంపిక కార్యక్రమం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఏవి సూరిబాబు అధ్యక్షతన జరిగింది. అధ్యక్షుడిగా కృష్ణయ్యపాలెం ఎంపిటిసి (టీడీపీ) బేధపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మోదుగుంట ఎంపీటీసీ (జనసేన) ఏపూరి సత్యనారాయణ ఎంపికయ్యారు. ఎంపీపీగా బేధపూడి వెంకటేశ్వరరావుకు దండగర్ర (జనసేన) ఎంపీటీసీ మరపట్ల రాజేష్ ప్రతిపాదన చేయగా, పెద్ద తాడేపల్లి-1 (టీడీపీ) ఎంపీటీసీ తూలుగు కొండలరావు బలపరిచారు. ఉపాధ్యక్షుడిగా ఏపూరి సత్యనారాయణకు కొత్తూరు (జనసేన) ఎంపీటీసీ ఎం. శ్రీనివాసరావు ప్రతిపాదన చేయగా, దండగర్ర (జనసేన) ఎంపిటిసి ఎం రాజేష్ బలపరిచారు. స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో రిటర్నింగ్ అధికారి ఏ.వి. సూరిబాబు అధ్యక్ష, ఉపాధ్యక్షుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ఎంపిటిసిల చేత ప్రమాణ స్వీకారం చేయించి, అనంతరం అధ్యక్ష,



ఉపాధ్యక్ష పదవులను చేతులు ఎత్తే పద్ధతిలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులకు రిటర్నింగ్ అధికారి ఏవి సూరిబాబు ఎంపిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాదేశిక నియోజకవర్గ అభివృద్ధికి ఎంపిటిసి సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు తమ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని చెప్పారు. పార్టీలకు అతీతంగా అందరం పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని, ప్రజలు గ్రామ అభివృద్ధి బాధ్యతను అప్పగించి ఓటు వేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పనిచేయాలని గెలుపొందిన ఎంపిటిసి సభ్యులకు తెలిపారు. నూతనంగా ఎంపికైన ఎంపిటిసిలకు అధికారులు తమ వంతు సహకారం పూర్తిగా అందించాలని చెప్పారు. మండల స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సక్రమంగా పనిచేసినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వి. చంద్రశేఖరం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోలు శాఖ గ్రంధాలయంలో అట్టహాసంగా మహిళా దినోత్సవ వేడుకలు

రాజోలు, నవంబర్ 19 (మీ వార్త విలేఖరి రవి) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు శాఖ గ్రంధాలయంలో 59 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మహిళా దినోత్సవ వేడుకలను రాజోలు గ్రంధాలయ అధికారిణి కె పద్మజ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. తొలుత భారతదేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె శకుంతల మాట్లాడుతూ భారత ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించారన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినిలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గ్రంధాలయ వారోత్సవాల ముగింపు సభలో బహుమతులతో పాటుగా ప్రశంస పత్రాలను ప్రముఖుల చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు రాజోలు శాఖ గ్రంధాలాయ అధికారిణి కె పద్మజ ఈ సందర్భంగా తెలియచేసారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు ఎం శ్రీలక్ష్మి, కె లక్ష్మీ, గ్రామ పెద్దలతో



పాటుగా గ్రంధాలాయ పాఠకులు పాల్గొన్నారు.

వేలేరుపాడు మండల పరిషత్ నూతన పాలకవర్గం ఏర్పాటు

వేలేరుపాడు, నవంబర్ 19 (మి వార్తా ప్రతినిధి) ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల పరిషత్ నూతన పాలకవర్గం ఏర్పాటయింది . మండల పరిషత్ అధ్యక్షురాలిగా బడిస వెంకమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఊకె సరోజిని బాధ్యతలు చేపట్టారు. గురువారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మొత్తం ఏడుగురు ఎంపీటీసీలకు గాను నలుగురు మాత్రమే హాజరయ్యారు. ప్రొసీడింగ్ ఆఫీసర్ పి.ఎన్.వి. శేఖర్ దొర అధ్యక్షతన, ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్. శ్రీనివాస్ బాబు, ఎమ్మార్వో ఎన్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా తాటుకూరుగొమ్మ పంచాయతీకి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు బడిస వెంకమ్మ ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేశారు. నార్లవరం పంచాయతీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు ఊకె సరోజిని వైస్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు ఎంపీటీసీ సభ్యులుగా సోడే సురేష్, కట్టే ఉదయ్ ప్రమాణ స్వీకారం చేశారు. అయితే మండలంలో మొత్తం ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండగా, ప్రమాణ



స్వీకార కార్యక్రమానికి నలుగురు మాత్రమే హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులను మహిళా ప్రజాప్రతినిధులు చేపట్టడంతో వేలేరుపాడు మండల పరిషత్‌లో నూతన పాలనకు శ్రీకారం చుట్టారు.

తాడేపల్లిగూడెంలో కూటమికి షాక్





వైసీపీలో చేరిన సీనియర్ టిడిపి నేత బడుగు పెద్దా

తాడేపల్లిగూడెం నవంబర్ 19 (మీ వార్త ప్రతినిధి) పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాడేపల్లిగూడెంలో కూటమికి షాక్ ఇస్తూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బడుగు వెంకటేశ్వరరావు (పెద్దా) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం తాడేపల్లిగూడెంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురాం నాయుడు సమక్షంలో వైసీపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన బడుగు వెంకటేశ్వరరావు రాష్ట్రస్థాయిలోనూ సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వడ్డి రఘురాం నాయుడు మాట్లాడుతూ, ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రజలకు మేలు చేసే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని నమ్మి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో బడుగు పెద్దా పార్టీలో చేరడం శుభపరిణామమని అన్నారు. బడుగు పెద్దా తనను నమ్ముకున్న వారికి ఎల్లప్పుడూ అండగా నిలిచే వ్యక్తి అని, ఎంతో నిజాయితీ కలిగిన నాయకుడని కొనియాడారు. పార్టీని నమ్మి ప్రజాసేవకు వచ్చే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ప్రజల్లోకి వెళ్లి వారికి అండగా నిలవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సమష్టిగా కృషిచేసి తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బడుగు పెద్దా మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి పదవుల ఆశతో తాను పార్టీలో చేరలేదని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ ప్రజలకు మేలు చేసే పరిస్థితి లేదని అభిప్రాయపడ్డారు. గతంలో రెండుసార్లు టిడిపి తరఫున కౌన్సిలర్‌గా పనిచేశానని, తన సొంత నిధులతోనే పలు అభివృద్ధి పనులు చేపట్టానని, ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం అందలేదని పేర్కొన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంతోనే అభివృద్ధి సాధ్యమని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని, పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని బడుగు పెద్దా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు గొర్రెల శ్రీనివాస్, 27వ వార్డు వైసిపి ఇన్చార్జ్ వల్లి, ముస్లిం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హార్టికల్చర్ సీడ్ ప్లాంటేషన్ పరిశీలన



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) కే కోడపల్లి పంచాయతీ నిట్టమామిడి గ్రామంలో హార్టికల్చర్ షీడు ప్లాంటేషన్ ను పరిశీలించిన జి మాడుగుల ఏపీవో కొండబాబు సూపర్వైజర్ కేజియా.. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో వివిజి రాంజీ పథకం ద్వారా కే కొడాపల్లి గ్రామపంచాయతీ ,నిటాపుట్టు గ్రామంలో రైతులకు సరఫరా చేసిన సిల్వర్ మొక్కలను ఏపీఓ కొండబాబు పరిశీలించారు. వివిధ గ్రామాలలో ఇచ్చిన సిల్వర్ మొక్కలను రైతులు సక్కగా సంరక్షించుకుంటూ అంతర పంట కింద రాజ్మా చిక్కుడు మరియు చిలకడదుంపలను వేసుకుంటూ మొదటి సంవత్సరంలోనే మంచి ఆదాయం పొందుతున్నారన్నారు. అలాగే వివిజి రాంజీ పథకం ద్వారా నిరుపేద రైతులను గుర్తించి వారికి సిల్వర్ మొక్కలను సరఫరా చేసి రాబోయే మూడు సంవత్సరాలలో ఆర్థికంగా అభివృద్ధి చెందేలాగా తోడ్పాటు అందిస్తామని, తెలియజేశారు.

పాయకరావుపేట ఎంపిపిగా కూండ్రపు రాజా ప్రమాణ స్వీకారం

వైస్ ఎంపిపిగా నేమాల స్వాతి ఎంపిక



పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,నవంబరు 19 : మండల పరిషత్ అధ్యక్షులుగా మండలంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన సత్యవరం-1 ఎంపీటీసీగా గెలుపొందిన కూండ్రపు రాజా ఎంపికయ్యారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి శ్రీరాములు మండలంలో గెలుపొందిన 27 ఎంపీటీసీల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎంపీపీని ఎన్నుకునే విషయంలో సత్యవరం -2 ఎంపీటీసీ కాకర్లపూడి వెంకట పెరుమాళ్ళ కృష్ణ వర్మ, సత్యవరం-1 ఎంపీటీసీ కూండ్రపు రాజా పేరును ప్రతిపాదించగా, పాయకరావుపేట 3 సెగ్మెంట్ ఎంపీటీసీ పెదిరెడ్డి నాగ వెంకటరమణ బలపరిచారు. దీంతో 20 మంది ఎంపీటీసీలు కూండ్రపు రాజాను ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ఎంపీపీగా మండలంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన పాల్మన్ పేట ఎంపీటీసీ నేమాల స్వాతి పేరును పాయకరావుపేట - 4 సెగ్మెంట్ ఎంపిటిసి గీసాల పద్మావతి ప్రతిపాదించగా, పెదరామభద్రపురం ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ బలపరిచారు. దీంతో వైస్ ఎంపీపీగా నేమాల స్వాతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీగా కూండ్రపు రాజా, వైస్ ఎంపీపీగా నేమాల స్వాతి లను ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎంపికైన ఎంపిపి కోండ్రపు రాజా, వైస్ ఎంపిపి నేమాల స్వాతిలను మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందించారు.

కార్తీక శోభతో విరాజిల్లిన పాంబండ క్షేత్రం...

కన్నులపండువగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు..



చిగురుమామిడి నవంబర్ 19 (మీ వార్త విలేకరి సొన్నాయిల భరత్): కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకొని పాంబండ పంచముఖ ఆంజనేయ పీఠం ఆధ్వర్యంలోని శ్రీ స్వయంభు పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి పుణ్యక్షేత్రం భక్తజన సంద్రంగా మారింది.పీఠం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ పూజ్య గురు హామేష్ స్వామీజీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను అత్యంత శాస్త్రోక్తంగా, వైభవపేతంగా నిర్వహించారు.లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ వ్రతాలలో పాల్గొనేందుకు చిగురుమామిడి,హుస్నాబాద్, కోహెడ, సైదాపూర్, హుజురాబాద్ మండలాలతో పాటు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ జిల్లాల నుండి దంపతులు, భక్తులు భారీ ఎత్తున విచ్చేశారు.వేదమంత్రోచ్చారణల మధ్య సాగిన ఈ పూజలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు..

శివకోటి ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మిక తనిఖీ



రాజోలు, నవంబర్ 19 (మీ వార్త విలేఖరి రవి) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు మండలం శివకోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్కే మెహబూబ్ బాషా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు శివకోటి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఉన్నతస్థాయి విద్యా ప్రమాణాలను జిల్లా విద్యాశాఖాధికారి భాషా స్వయంగా పర్యవేక్షించారు. విద్యార్థులను ప్రశ్నించిన డీఈవో విద్యార్థుల నుండి ఉపాధ్యాయుల బోధన తీరును తెలుసుకున్నారు. అనంతరం డీఈవో బాషా పాఠశాల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నైనాల శ్రీనివాస్ రావు తో పాటుగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరులోనూ జనసేనదే హవా....!

ఎంపీడీవో.. వాయిదా వేసినప్పటికీ బి ఫాం తెచ్చుకున్న జన సైన్యం

గూడూరు నవంబర్ 19 (మీ వార్త ప్రతినిధి)
నియోజకవర్గ పరిధిలోని గూడూరు మండల పరిధిలోని ఎంపీటీసీ అభ్యర్థులు తో పాటు జెడ్పిటిసి అభ్యర్థి కూడా గెలుపొందారు. 14 సెగ్మెంట్లలో కూటమి ప్రభుత్వం విజయం సాధించినప్పటికీ కేవలం జనసేన అభ్యర్థులు తక్కువ కావడంతో పక్కకు తోసే ప్రయత్నం జరిగింది. ఎంపీపీ అభ్యర్థిగా గెలిచిన బల్లా రాజేష్ తనే మండలాన్ని మొత్తం శాసించాలని కలలు కన్నాడు. అంతే కాదు స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలను కూడా లెక్కచేయకుండా ఒకింత ముందుకు దూకి బురదలో పడ్డాడంటూ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అందువలన ప్రమాణ స్వీకారానికి అలాగే కూటమి గెలుపుకు ఎంతో ప్రాతినిధ్యం వహించిన జనసేన పార్టీ కూడా కృషి చేసిందని వైస్ ఎంపీపీ పదవి తమకు ఇవ్వాలంటూ గత రెండు రోజులుగా పట్టు పట్టింది. స్థానిక జనసేన నాయకుడు సీనియర్ న్యాయవాది ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్నారు. అంతే టిడిపి ఆదేశాలను సైతం లెక్కచేయకుండా ఎక్కడో బందరు మండలానికి కూతవీడు దూరంలో నుంచి వలస వచ్చిన వారే ఈక్కడ ఆధిపత్యం చెలాయించుకోవాలనుకుంటే ఎలాగూ. మా జనసేనకు గూడూరు మండలంలో ఓటు బ్యాంకు ఉంది దానివల్లనే ఇంతటి ఘన విజయం సాధించారు కనుక కూటమి ప్రభుత్వం ఇచ్చిన అభ్యర్థుల్ని గెలిపించుకున్నామని కనీసం వైస్ ఎంపీపీ పదవీ



అయినా ఇవ్వాలని పట్టుబట్టారు. తాను పట్టిన కాళ్లు కుందేలుకు మూడే కాళ్లు అన్న సన్నంగా చందంగా పట్టువదల్లేదు ప్రమాణ స్వీకారం రోజుని మండల అభివృద్ధి అధికారిని వైస్ ఎంపీపీ ఉపసర్పంచ్ పదవికి ఇంకా బీఫామ్ పట్టా ఇవ్వలేదని ఎవరైతే తీసుకొస్తారు వారికే కార్యాలయంలో పట్టం కట్టి సాధారంగా ఆహ్వానిస్తామంటూ పిలుపునిచ్చారు. విషయాన్ని తెలుసుకున్న జనసైనికులు కార్యకర్తలు అభిమానులు విని వెంటనే వైస్ ఎంపీపీ పదవి జనసేనకు కేటాయించాలని ఉన్నత నాయకుల వద్ద కంకణం కట్టారు. దీంతో చేసేది లేక అనుమతులు ఇవ్వడంతో రేపు ఉదయాన్నే జనసేన పార్టీ అభ్యర్థి చెందిన మహిళ అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు ఈ వేడుకకు మండల నలుమూలల నుంచి జనసైనికులు భారీ ర్యాలీతో వచ్చి ఈ విజయోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలున్నారు. ఇదిలాగే కొనసాగితే మండలంలో పార్టీ సంగతి.
మీ వార్త ప్రతినిధి పెడన

ముంగండ సర్పంచ్ అభ్యర్థిగా చప్పిడి నాగబాబు నామినేషన్





భారీగా తరలివచ్చిన గ్రామస్థులు

పి. గన్నవరం నవంబర్ 19 (మీ వార్త ప్రతినిధి):
మండల పరిధిలోని ముంగండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా చప్పిడి నాగబాబు నామినేషన్ దాఖలు చేశారు. గురువారం తన స్వగృహం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన అయన మచ్చాలమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నామినేషన్ పత్రంపై తొలి సంతకం చేసి, అక్కడి నుంచి గ్రామస్థులతో కలిసి ముంగండ గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. అయితే ఈ నామినేషన్ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది నాగబాబు తీసుకున్న నిర్ణయం. సాధారణంగా వాహనాలతో ర్యాలీలు నిర్వహించే సంప్రదాయానికి భిన్నంగా, తన నివాసం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ఆయన నడుచుకుంటూ వెళ్లారు. ఒక సాధారణ వ్యక్తిగా, సాధారణ ప్రజల మధ్య ఉంటూ గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన నాగబాబుకు మద్దతుగా గ్రామస్థులు సైతం అడుగులో అడుగు వేస్తూ నడిచారు. ఈ ర్యాలీలో యువత, మహిళలు, గ్రామ పెద్దలు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చప్పిడి నాగబాబుకు తమ మద్దతు తెలిపారు.

ఫలించిన వ్యూహం- దక్కిన పీఠం





రాజకీయ వ్యూహకర్త పాడేరు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి.

జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) జి.మాడుగుల మండల రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. స్థానిక సంస్థల ఎంపీపీ ఎన్నికల్లో గిడ్డి ఈశ్వరి వ్యూహం ఫలించింది. గత రెండు పర్యాయాలుగా పాడేరు నియోజక వర్గంలో వైసిపి పార్టీ విజయం దిశగా అడుగులేస్తూ, ఎమ్మెల్యేలు గా గెలుపొందినప్పటికీ, జి.మాడుగుల ఎంపీపీ పీఠాన్ని మాత్రం టిడిపి కైవసం చేసుకుంటూ వస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడంలో పాడేరు నియోజక వర్గ టిడిపి ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వ్యూహం ఫలించి ఎంపీపీ పీఠం మరొకసారి టిడిపి దేనని నిరూపించుకుంది.. జి మాడుగుల మండలంలో జరిగిన 15 ఎంపీటీసీ స్థానాలకు గాను వైసీపీకి 7 స్థానాలు ,తెలుగుదేశం పార్టీ కి 5 స్థానాల్లో విజయం సాధించగా , స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు గెలుపొందారు. దీంతో జిమాడుగుల ఎంపీ పీఠానికి దక్కించుకోవడానికి వైసీపీ పార్టీ కి ఎనిమిది మంది కాగా అప్పటికే వైసీపీకి ఏడుగురు అభ్యర్థులు గెలుపొందగా ఎంపీపీ పీఠానికి గెలుపొందడానికి ఒకే ఒక్క స్వతంత్ర అభ్యర్థి అవసరం. ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడానికి వైసిపి అధిష్టానం సరైన వ్యూహరచన లేకపోవడం, మండల స్థాయిలో బలమైన నాయకత్వ, పరిపక్వత లేకపోవడంతో ఎంపీపీ పీఠం చేతులారా పోగొట్టుకున్నా మని పార్టీ కార్యకర్తల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.. ఇది ఇలా ఉండగా జిమాడుగుల ఎంపీపీ పీఠాన్ని ఎలాగైనా సొంతం చేసుకోవాలని దృఢ సంకల్పంతో టిడిపి పార్టీకి ఐదుగురు ఎంపీటీసీలే గెలుపొందగా. టిడిపి గెలుపుకి మరో ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు అవసరం పడగా ,గిడ్డి ఈశ్వరి కీలక పాత్ర పోషించి ఎంపీపీ పీఠం గెలవడానికి అవసరమైన మెజారిటీ కోసం మరో ముగ్గురుస్వ తంత్ర (ఇండిపెండెంట్) అభ్యర్థుల మద్దతును కూడ గట్టడంలో గిడ్డి ఈశ్వరి తన రాజకీయ చతురతను ప్రదర్శించారు. స్వతంత్ర అభ్యర్థులను సమన్వయం చేసి, మొత్తం 8 మంది సభ్యుల బలంతో జి.మాడుగుల ఎంపీపీ పదవిని మూడోసారి టిడిపి ఖాతాలో వేయడం లో ఆమె కీలక పాత్ర పోషించారని స్థానిక నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు..

ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలి

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని గిరిజన సంక్షేమ శాఖ అకాడమిక్ మానిటరింగ్ మొబిలైజింగ్ ఆఫీసర్ (ంఅఓ) పి. ఉద్ధవ్ సూచించారు. గురువారం దంతన్‌పల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని భీమ్‌జీగూడ, బుగ్గగూడ, చింతనమాదర, మర్కగూడ, నాగుగూడ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిర్దిష్ట సమయపాలన పాటిస్తూ, బోధనా ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలను పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను నిరంతరం అంచనా వేస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి విద్యార్థి మెరుగైన విద్యా ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కోరారు.
ఈ పర్యటనలో ఎస్ సి ఆర్ పి కనక కైలాస్ పాల్గొన్నారు.

తోచలక రాయుడుపాలెం సర్పంచ్ అభ్యర్థి ,ఎలికే వెంకటేశ్వరరావు



లింగపాలెం, నవంబర్ 19 (మీ వార్త విలేఖరి): రాయుడుపాలెం సర్పంచ్ అభ్యర్థి గాఎలికే వెంకటేశ్వరరావు వైసీపీ అభ్యర్థిత్వం ఖరారు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తమకు ప్రజల్లో మద్దతు తీసుకువస్తాయని ధీమా వ్యక్తం చేశారు.సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పెన్షన్ లు, సచివాలయాలు, ఇంటి వద్దకే రేషన్, ఇంటివద్దకే పెన్షన్, లాంటి అనేక సంక్షేమ పథకాలు జగన్మోహన్ రెడ్డి అందించారని ఆ సంక్షేమ పథకాలే మా గెలుపుకు కారణం అవుతాయని ధీమా వ్యక్తంచేశారు.తాము గెలిచిన వెంటనే గ్రామంలో మౌలిక సదుపాయాలు, గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా తువ్వచలక రాయుడుపాలెం మెజారిటీతో గెలిపించాలనివిజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ హామీలు కాకుండా ఈయన సొంత నీదులతో కూడా గ్రామంలో శ్మశానవాటిక స్థలాలను ఇస్తానని మరియు, పెన్షన్ కు అర్హులైన వారికి వేరే ఇతర కారణాలతో మధ్యలో పెన్షన్ నిలిపివేసిన తన సొంతడబ్బులు ఇస్తానని హామీ ఇచ్చారు. మాట తప్పం మడమతిప్పం అనే జగన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

ప్రజా తీర్పే మా బలం...

మండలంలో వైఎస్సార్‌సీపీ విజయంపై నేతల ధీమా!



వేలేరుపాడు నవంబర్ 19 (మి వార్తా ప్రతినిధి) మండలంలో వైఎస్సార్‌సీపీ సాధించిన విజయం ప్రజల విజయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు ఏ పార్టీ ద్వారా మేలు జరుగుతుందో ప్రజలే నిర్ణయించుకుని తమ తీర్పును వెల్లడించారని, ఏడు స్థానాల్లో పార్టీకి ప్రజల మద్దతు లభించిందని ధీమా వ్యక్తం చేశారు. పొత్తులో భాగంగా సీపీఐ (ఎంఎల్) పార్టీకి కేటాయించిన రెండు స్థానాల్లో నామినేషన్లను సాంకేతిక కారణాలు చూపి రద్దు చేయించారని, దీని వెనుక అధికార పార్టీ ఒత్తిళ్లు, కుట్రలు ఉన్నాయని ఆరోపించారు. పోలీసుల ద్వారా బెదిరింపులు, అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించారని విమర్శించారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనూ మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో, సమన్వయంతో పనిచేసి విజయాన్ని అందించారని తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి విజయానికి కృషి చేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ సెల్యూట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏడుగురాళ్లపల్లి సర్పంచ్ అభ్యర్థిగా కురసం కృష్ణవేణి నామినేషన్



చింతూరు, నవంబర్ 19 మీ వార్త ప్రతినిధి : పోలవరం జిల్లా చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి పంచాయతీ కూటమి జనసేన పార్టీ సర్పంచ్ అభ్యర్థి కురసం కృష్ణవేణి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తన స్వగృహం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా బయలుదేరి మార్గమధ్యంలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ కార్యక్రమంలో చింతూరు జనసేన పార్టీ అధ్యక్షుడు మడివి రాజు, బేడే సతీష్, తీగల కవిత, బాబీ, తెలుగుదేశం పార్టీ నాయకులు రవ్వ జోగారావు, మడకం వెంకయ్య, సవలం గంగరాజు, మోహన్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధ్యానం కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్యతో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్ ధ్యానం కొనుగోలు ప్రారంభం చేశారు. అనంతరం నగరపాలక సంస్థ పరిదిలోని బొమ్మకల్ ప్రాంతంలో కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి... ధ్యానం తూకం వేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ కు రైతులు, రైతు సంఘ నాయకులు శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ....రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ధ్యానం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. కొనుగోలు కేంద్రం లో రైతులకు అవసరమైన గన్ని బ్యాగులు, టార్పలిన్లు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. కాంటా వేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించే విధంగా రవాణా చర్యలు తీస్కువేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు తేమ శాతం లేకుండ ధాన్యం ఆరబెట్టాలని... తేమ శాతం లేకుండా ఉంటేనే సరైన ధర వచ్చే అవకాశం ఉందని సూచించారు. రైతులు కూడ నాణ్యమైన ధాన్యం

జీరో కట్స్‌తో సెన్సార్ పూర్తి చేసుకున్న సల్మాన్ ఖాన్ ‘మాతృభూమి’.. విడుదల ఎప్పుడంటే?



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన ‘మాతృభూమి’ (‘మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్’) చిత్రం సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఖ/ూూ 16+ సర్టిఫికెట్ జారీ చేసింది. ఎలాంటి కట్స్ సూచించకుండానే సినిమాకు క్లియరెన్స్ లభించడం విశేషం. ఈ చిత్రం మొత్తం నిడివి 2 గంటల 34 నిమిషాల 12 సెకన్లుగా ఖరారైంది. తొలుత నవంబర్ 20న విడుదల చేయాలనుకున్నప్పటికీ, కొన్ని కారణాలతో వాయిదా పడింది. తాజాగా ఈ చిత్రాన్ని డిసెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. 2020 గల్వాన్ లోయ ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. దేశ రక్షణ కోసం పోరాడే సైనికాధికారి కల్నల్ సంతోష్ బాబు పాత్రలో సల్మాన్ ఖాన్ నటించగా, కుటుంబ బాధ్యతలను నిలబెట్టే భార్య పాత్రలో చిత్రాంగదా సింగ్ కనిపించనున్నారు. వీరిద్దరి త్యాగం, భావోద్వేగాల చుట్టూ కథ సాగుతుంది. మొదట ఈ సినిమాను ‘బ్యాటిల్ ఆఫ్ గల్వాన్’ పేరుతో ప్రకటించగా, మార్చి 2026లో ‘మాతృభూమి’గా మార్చారు. ప్రభుత్వ ఒత్తిడితో స్క్రిప్ట్‌లో మార్పులు చేశారన్న వార్తలను సల్మాన్ ఖాన్ ఖండించారు.

‘దళపతి’ సీన్ రీక్రియేట్ చేసిన అనిల్ రావిపూడి



వినూత్న ప్రమోషన్లతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడంలో దర్శకుడు అనిల్ రావిపూడి ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తన కొత్త సినిమా ‘జనవరి 12 విడుదల’ ప్రమోషన్లను కూడా అదే తరహాలో ప్రారంభించారు. ఈ సినిమాలోని పాటల సందడిని రేపటి నుంచి మొదలుకానుందని వినూత్నంగా ప్రకటించారు.

దళపతి సినిమాలోని ఇందుకోసం సూపర్‌స్టార్ రజనీకాంత్, శోభన నటించిన ‘దళపతి’ సినిమాలోని ఓ ఫేమస్ సన్నివేశాన్ని నటి కృతిశెట్టితో కలిసి రీక్రియేట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది నెట్టింట వైరల్‌గా మారింది. ఇది చూసిన నెటిజన్లు ‘మళ్లీ కొత్త కాన్సెప్టా అనిల్ భయ్యా.. ఈ సారి రజనీసార్‌నే వాడేశారు’గా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా ఇంతకముందు వివాహ భోజనంబు చిత్రంలోని సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందం మధ్య బీచ్‌లో జరిగే ఓ సన్నివేశాన్నిమ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్‌కుమార్‌తో రీక్రియేట్ చేశారు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ మూవీని సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మాస్ యాక్షన్ విందుతో బెల్లంకొండ ‘టైసన్ నాయుడు’ టీజర్.!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో, దర్శకుడు సాగర్ కె. చంద్ర తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘టైసన్ నాయుడు’. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో పవర్‌ఫుల్ లుక్‌తో కనిపించనున్నారు. నేహా శెట్టి, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో నరేష్, రావు రమేష్, సునీల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ‘మదరాసి రబ్బరు బొమ్మ’ పాటకు మంచి స్పందన లభించగా, తాజా టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. త్వరలోనే చిత్ర విడుదల తేదీపై మేకర్స్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

మెన్స్ డే స్పెషల్.. ‘రాపో23’ ప్రీ-లుక్ వైరల్!

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కెరీర్‌లోనే ఒక పెద్ద సాహసానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు హీరోగా అలరించిన ఆయన, ఇప్పుడు తొలిసారిగా కథ రాసి, దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న ‘రాపో23’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా, నియో-నోయిర్ శైలిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఆరంభం నుంచే మంచి ఆసక్తి నెలకొంది.

నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం (ఇంటర్నేషనల్ మెన్స్ డే) సందర్భంగా రామ్ పోతినేని ఈ సినిమా నుంచి ఒక ఆసక్తికరమైన ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. “ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్” అనే క్యాప్షన్‌తో వచ్చిన ఈ పోస్టర్‌లో రామ్ తనదైన శైలిలో, కొత్త లుక్‌తో కనిపిస్తూ అభిమానుల్లో జోష్ నింపారు. తన దారిని తానే ఎంచుకుంటూ, ప్రపంచాన్ని ఒంటరిగా ఎదుర్కొనే స్వతంత్ర వ్యక్తిగా ఈ పాత్రను ఆయన పరిచయం చేశారు. ఈ పోస్టర్ ద్వారా అందరికీ మెన్స్ డే విషెస్ చెప్పిన చిత్రబృందం, త్వరలోనే సినిమా ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ సినిమా టైటిల్ ఏంటి, టీజర్ ఎలా ఉండబోతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తుండగా, ఎస్. తిరునావుక్కరసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూస్తున్నారు. దర్శకుడిగా, నటుడిగా రామ్ పోతినేని ఈ సినిమాతో ఎలాంటి కొత్త అనుభూతిని పంచుతారో చూడాలి.



20 రోజులకే ఓటీటీలోకి వచ్చేసిన విశ్వక్ సేన్ ‘కల్ట్’ స్ట్రీమింగ్ ఎందులో అంటే?



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో నటించిన సైకలాజికల్ స్లాషర్ థ్రిల్లర్ ‘కల్ట్’ అనూహ్యంగా ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన కేవలం 20 రోజులకే ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రావడం విశేషం. ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులో ఉంది. 2026 అక్టోబర్ 30న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, మిశ్రమ స్పందనల మధ్య థియేటర్ రన్ పూర్తి చేసుకున్న వెంటనే ఓటీటీలోకి అడుగుపెట్టింది. కథ విషయానికి వస్తే, ఒక భారీ పార్టీ వేడుకగా మొదలైన సంబరం, వరుస హత్యలు మరియు ఉత్కంఠభరిత పరిణామాలతో ప్రమాదకరంగా మారుతుంది. ఆ పరిస్థితుల్లో డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు, అసలు మిస్టరీ ఏంటి అనే ఆసక్తికర అంశాలతో ఈ స్లాషర్ థ్రిల్లర్ సాగుతుంది. విశ్వక్ సేన్ సరసన గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్‌గా నటించగా, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, ప్రజ్ఞ కీలక పాత్రల్లో కనిపించారు. తరుణ్ భాస్కర్ సంభాషణలు అందించగా, రవి బస్రూర్ సంగీతం సమకూర్చారు. తారక్ సినిమాస్ ఎల్ఎల్పీ, వన్మయే క్రియేషన్స్ బ్యానర్లపై సందీప్ కాకరాల, కరాటే రాజు ఈ చిత్రాన్ని నిర్మించారు. థియేటర్లలో మిస్సయిన వారు లేదా కొత్త స్లాషర్ థ్రిల్లర్ జోనర్‌ను ఇష్టపడే ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.